# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి

VOLUME 32 ISSUE 1

No. OF PAGES 40

SEPTEMBER 2012

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

***ఈ సంచికలో***........................... ...... **పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| నేత్రార్పణ చేసిన మహాభక్తుడు | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 15 |
| పరిప్రశ్నేన సేవయా | 17 |
| శివానందలహరి | 18 |
| స్థిత ప్రజ్ఞస్య కా భాషా? | 20 |
| చిన్న చీమ కథ | 22 |
| తారక విద్య | 24 |
| అమృతాభిషేకం | 26 |
| హృదయాంతరవాసి భగవాన్ | 28 |
| ధర్మ రహస్యం | 29 |
| నేను అర్థం చేసుకున్న శ్రద్ధాత్రయ విభాగ యోగం | 32 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 34 |
| రావణుని పూర్వజన్మ వృత్తాంతము | 36 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

మోక్ష ద్వారే ద్వారపాలాః చత్వారః ప్రకీర్తితాః ।
శమో విచారః సంతోషః చతుర్థః సాధు సంగమః ॥ – యోగవాసిష్ఠము

మోక్షాన్ని పొందాలని అభిలషించేవారు మోక్ష ద్వారాన్ని కావలి కాచే నలుగురు ద్వారపాలకులను అధిగమించాలని శాస్త్రం చెబుతోంది. వారే శమము, తత్త్వ విచారము, సంతోషము, సాధుసంగమము.

శమము అంటే అంతరేంద్రియ నిగ్రహము. అంతరేంద్రియాలకు అధినేత మనస్సు. సంకల్ప వికల్పములకు నిలయమైన మనస్సుని జయించటం చాల కష్టం. మనస్సు అనాదియైన అజ్ఞానముచే జనించిన వాసన చేత సంకల్ప వికల్పములకు హేతువగుచున్నదని స్పష్టముగ తెలుస్తోంది. మలిన వాసనలను అధిగమించటానికి నిస్సంగత్వము, మమత్వమును త్యజించుట తోడ్పతాయి. కారణమును నిరోధించుట వలన కార్యమును నిరోధించ వలెనన్నది పెద్దల భావన.

ఇంక తత్త్వ విచారణ అనేది నేనెవరు? ఈ జగత్తు ఎలా ఉద్భవించింది? దీనికి కర్త ఎవరు? ఉపాదాన కారణ మేది? అనే నాలుగు భావములను తెలుసుకొనుటయే విచారణ. నేనెవరు అన్న ప్రశ్న వేసుకుని, నేను ఈ జగత్తుకు, దేహమునకు, యింద్రియములకు, పంచకోశములకు, పంచప్రాణములకు, మనస్సుకు, బుద్ధికి సాక్షిని అనే విషయాన్ని అనుభవ పూర్వకంగా విచారణ చేయాలి. ఈ దృశ్య ప్రపంచం ఎలా ఉద్భవించింది? అన్న విషయాన్ని విచారణ చేయాలి.

ఈ జగత్తు బ్రహ్మ నుండియే ఉద్భవించిందని ఆరూఢంగా తెలుసుకుని, యీ జగత్తు నాకు భిన్నంగా ఉన్నదనే భావనయే జ్ఞానము. ఆ భావన ద్వారా జగత్తుకి కర్త, సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడైన ఈశ్వరుడని తెలుసుకోగలగుతాడు.

ఇంక జగత్తునకు ఉపాదాన కారణమేది అన్న విషయము మాయయే అని వివేకవంతుడైన సాధకుడు గ్రహించగలుగుతాడు.

సంతోషం అంటే ఏదైనా వస్తువును పొందటం ద్వారా లభించేది కాదు. ఏ రకమైన అసంతృప్తి లేకపోవటమే సంతోషానికి మూలము.తాను ఉన్నది ఆనంద స్థితియే. దాన్ని గుర్తించటమే సంతోషము.

మోక్షప్రాప్తికి సాధుసంగమము అత్యంత ఆవశ్యకము. సద్గురుమూర్తి సమాశ్రయం మోక్షప్రాప్తికి సులువైన మార్గము. ఆయన బోధశ్రవణము, మననము, నిదిధ్యాసకు దోహదము చేస్తుంది.

పరాశర ప్రసాద్
గౌరవ సంపాదకుడు

# యోగి వేమన

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

10. ఇంటియాలి విడిచి యిల జారకాంతల
వెంటఁదిరుగువాఁడు వెఱ్ఱివాఁడు,
పంటచేను విడిచి పరిగయేరినయట్లు
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

కట్టుకొన్న భార్యను విడిచి పరకాంత వెంట తిరుగు మూర్ఖుడు, పంటచేను విడిచిపెట్టి పరిగ గింజలకు ఆశపడెడు వాని వంటివాడే యగును.

11. ఇంద్రియములచేత నెగ్గొందుచుండెడు
వెఱ్ఱి మనుజుఁడెల్ల వెదకు శివుని
ఇంద్రియముల రోసి యీశునిఁజూడరా
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు యింద్రియములను అరికట్టక భగవంతుని చూడగోరును. ఇంద్రియ నిగ్రహము కలవారే భగవంతుని చూడగలరు.

12. ఇన్ని జాతులందు నేజాతి ముఖ్యమన్
ఎఱుక గల్గువారె హెచ్చువారు
ఎఱుక లేనివార లేజాతినున్నను
జీనజాతియంచు నెఱుఁగు వేమ

తాత్పర్యము -

జాతులన్నిటిలో ఏ జాతి గొప్పది? అని ప్రశ్నించిన, జ్ఞానమున్నవారే గొప్పవారని తెలియవలెను. జ్ఞానములేనివారు ఉత్తమజాతివారైనను, నీచజాతివారే అగుదురు.

# శ్రీబాబూజీ ఉవాచ

- వెంకటరమణ ప్రసాద్

గత సంచిక తరువాయి

తనచేతిలో కఱ్ఱకోసం తడుముకుంటే వేణువు తగిలింది. ఆ వేణువును పెదిమలకు ఆనించి పూరించసాగాడు. ఎంతో మాధుర్యం! ఆనందవీచికలు ప్రకృతిని పొదువుకుంటున్నాయి. ఒక రసప్రవాహం జగత్తునూ, తననూ ముంచెత్తుతున్నది. కఠిన శిలల వంటి మానవ హృదయాలను కూడా ద్రవింపజేయ గలిగిన, రసింపజేయగలిగిన, పరవశింప జేయగలిగిన మధుర మంజులనాదం! తాను పుట్టించిన ఆ సంగీత మధుర సుధాలహరిలో తానే మునిగిపోయాడు సూరదాసు.



అలా సూరదాసు మహామధురంగా వేణువు పూరిస్తూ నర్తిస్తూ ఉంటే , తన చక్రాల్లాంటి కళ్ళతో చూస్తూ నుదిటిమీద అలకలు అల్లలాడగా, సూరదాసు ఎదురుగా బాసీపట్టు వేసుకుని, ఎడమచేతి మీద గడ్డం ఆన్చి, కుడిచేతితో వేణువును విలాసంగా తిప్పుతూ కూర్చున్నాడు శ్యామసుందరుడు. తన ఒళ్ళంతా కళ్ళూ, చెవులూ చేసుకుని, తన ప్రియసూరదాసును చూస్తూ, అతని మధురమైన వేణువును వింటూ కూర్చున్నాడు ప్రభువు. కొంచెంసేపు తరువాత ప్రేమగా, ఆప్యాయంగా సూరదాసు భుజం మీద తట్టాడు స్వామి.

ఆ స్పర్శ తన యిన్నేళ్ళ జీవితంలోనూ ఎప్పుడూ ఎక్కడా తగలని మధురమైన, అలౌకికమైన, ఆనందపూర్ణమైన స్పర్శ. తను అంతగొప్ప కవి అయిఉండి, ఆ స్పర్శలో సహస్రాంశాన్ని వర్ణించి తన చదువరులకు అందుబాటులోకి తేవాలనుకున్నాడు సూరదాసు.

“ఒక వేయి వేణువులు పరమ మధురంగా విరిశాయని చెప్పనా? అబ్బే బాగుండలేదు. వేణువు విరియటమేమిటో?” అనుకున్నాడు సూరదాసు. ఏది ఏమైనా ఆ స్పర్శతో ప్రకృతిలోకి వచ్చాడు. ఈ మారిన దృశ్యాన్ని చూసి ముగ్ధుడైనాడు సూరదాసు. గోపీ హృదయాధినాధుడు, శ్యామసుందరుడు, రాజాధిరాజు, సౌందర్యనిధి, లావణ్య సీమ, జగత్తుకు వెన్నెల, తన ప్రాణం, తన ఊపిరి, అబ్బ! చూపుల వెన్నెలలో ప్రకృతినీ, తననూ (సూరదాసును) ముంచెత్తుతున్నాడు. శ్యామసుందరుడి ఆ ముగ్ధమోహన సౌందర్యాన్ని తన మనోనేత్రంతో ఒక్క గుక్కలో త్రాగి నిల్పుకున్నాడు సూరదాసులోని కవితల్లజుడు.ప్రతి వివరమూ గుండెలో దాచుకున్నాడు సూరదాసు.

రమణీయమై, వర్ణ సంకీర్ణమైన నెమలిఫించం, లలితేంద్రనీల శకలాభములైన అలకలు, అర్ధచంద్ర సమమైన ఫాలభాగం, గేదగిరేకులబోలు కపోలాలు, ఎఱ్ఱని

దొండపండులాంటి అధరం, నవ్వు పువ్వులాంటి కోటేరు వేసినట్లున్న నాసిక, పరమ సుందరమైన చుబుకము, అరవిరసిన అరవింద యుగళమువంటి కన్నులు, చిన్న సూరీ గుమ్మడికాయవంటి పొట్ట, పాదాలు! ఓహ్! పాదాలు..... పా... దా..... లు..... ! సూరదాసు మనస్సు నిల్చిపోయి ఆ దివ్యపాదాబ్జములయందు లీనమైంది! దివ్యమైన సమాధిస్థితిని పొందాడు సూరదాసు. అలా ఎంతసేపు కేవల సాక్షిమాత్రంగా ఉన్నాడో అతనికే తెలియదు. తెలియటానికి కాలం ఉంటేగా అక్కడ!

"సూరదాసూ! ఓ సూరదాసూ! నేను వచ్చాను. నేనూ? నీ కంటిచూపునయ్యా" అన్నాడు శ్యామసుందరుడు.

"అవును కన్నయ్యా! నువ్వే నా కంటి చూపువు. నువ్వే నా లోపలి వెలుగువు. నువ్వే వెలుగులన్నిటికి వెలుగువు!" అన్నాడు సూరదాసు.

"అదికాదు సూరదాసూ! నీ కంటి చూపు నీకిస్తాను వినిపించిందా? నీ కంటిచూపు నిచ్చేస్తానంటున్నా! తీసుకో" అన్నాడు ఘనశ్యామ్.

"ఓ శ్యామసుందరా! నా కన్నయ్యా! నా ప్రభూ! మమనాధా! జగన్నాధా! ఏమంటున్నావు నువ్వు? ఏమీ చేతగాని నిస్సహాయుడైన ఒక ముసలి పుట్టుగుడ్డుకు నువ్వు ఒక మహత్తర దివ్యదర్శనం ప్రసాదించావు ప్రభూ! కరుణామయా! యోగీశ్వరేశ్వరులకు దుర్లభమైన నీ దివ్యమోహన రూప దర్శన భాగ్యం ప్రసాదించావు.

ఓ అవ్యాజ కరుణామయీ! యిప్పుడు నేను పొందిన యీ దర్శనం ఎన్నో జన్మల పుణ్యఫలం! ఇక ఈ చర్మ చక్షువులతో నేను చూడవలసినదిగాని, పొందవలసినదిగాని ఏదీ లేదు. నీ దివ్య మోహన రూపాన్ని చూచిన యీ కన్నులు పాపపంకిలమైన జగత్తును చూడలేవు. కనుక నా కంటి చూపును నువ్వే తీసుకో. నాకు మాత్రం యిప్పటిదాకా చూడగలిగే భాగ్యాన్ని ప్రసాదించు. ఈ దివ్య దృశ్యాన్ని యిలాగే శాశ్వతంగా అనుభవించనివ్వు ప్రభూ!" అని కోరుకున్నాడు.

"తథాస్తు- అలాగే" అని దీవించాడు మురళీమోహనుడు. సూరదాసు ప్రార్థనను మన్నించి అక్కడే ఉండిపోయాడు ప్రభువు. భక్తిపాశాలకు మాత్రమే కట్టుబడే ఆ నందకిశోరుడు సూరదాసు భక్తిపాశాలకు ఎంతగా కట్టుబడిపోయాడంటే బృందావనాన్నీ, గోపికలనూ, వెన్నమీగడలనూ, యమునానదినీ, అఖరుకు రాధాదేవినీ కూడా విస్మరించి సూరదాసుతో ఉండిపోయాడు. సూరదాసుతో ఉండిపోవటమే కాదు, అయనకు అన్ని సపర్యలూ చేసేవాడు. సూరదాసు పాడేటప్పుడు నిశ్శబ్దంగా అల్లరి మానేసి బుద్ధిగా కూర్చుని వినేవాడు. సూరదాసు చేత స్నానం చేయించేవాడు, అన్నం తినిపించేవాడు, చేయిపట్టుకుని నడిపించేవాడు,షికారుకు తీసుకెళ్ళేవాడు.

-సశేషం

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

ఒకే గురుపాదాన్ని ఆశ్రయించండి. ఎవరు సమర్థులో, వారిని ఆశ్రయించండి. "స్వయం తీర్ణా- పరాం తారయంతి" అన్నారు. తాను స్వయంగా తరించినవారే, ఇతరులను తరింపచేయగలరు.

గురుతత్వం అనేది ఒక రూపంతో ముడిపడి లేదు. అర్జునుడు స్వామియొక్క విశ్వరూపాన్ని దర్శించినప్పుడు అతడు కూడా ఆ విశ్వరూపంలోనే వున్నాడు. ఇక్కడున్న ప్రతివారూ కూడా ఏదో ఒక దేవుడ్ని ఆశ్రయించే వున్నారు.



మీరు నమ్మిన దేవుడు అనంతుడని నమ్మండి. ఆ అనంతత్వంలో మీరూ వున్నారు. మనం నమ్మిన దేవుడిలో మనం వున్నాం. మనలో దేవుడు వున్నాడని గుర్తించండి. ఈ దేహంతో వుండగానే ఆ భగవత్తత్వాన్ని తెలుసుకుంటే జన్మ సార్థకమవుతుంది. ఈ రోజు యిక్కడ సత్సంగానికి రాకుండా వుండి వుంటే, మీరందరూ ఏ ఇంటిపనులలోనో, వంటలోనో, టి.వి.ల్లోనో మునిగిపోయి వుండి వుండేవారు. కానీ, యిక్కడికి రావడం వలన కాలాన్ని సద్వినియోగ పరచుకోవడమైనది.

కేవలం పుస్తకాలు చదవడం వలన మనకి జ్ఞానమొచ్చేస్తుందా అంటే, రాదు. కానీ మనలో వున్నదానిని మనం గుర్తించడానికి పుస్తకాలు సహాయం చేస్తాయి. అదైనా, చదివినది మనం ఆచరించినప్పుడు మాత్రమే. చదువు లేకపోయినా సంస్కారం, సేవాసక్తి ఉంటే చాలు. రెండు దళాలు కోసి 'ఇవి స్వామి సేవకు వినియోగించుకోండి' అని యిచ్చినా, అది సేవే అవుతుంది. అలాగే ఎక్కడేనా చెత్తపడివుంటే, దానిని తీసి శుభ్రం చేస్తే అదీ సేవే అవుతుంది. ఆకలి గొన్నవాడికి అన్నం పెట్టడం, బాధలో వున్నవారిని ఓదార్చి వారికి వైద్యం చేయడం, ఇవన్నీ సేవలే. ఇంద్రియ నిగ్రహం కలిగివుండి, నిరంతర భగవన్నామ స్మరణతో చేసిన ఏ పనైనా కూడా అది భగవత్కైంకర్యమే అవుతుంది. అలాగని దొంగతనం కూడా చేయవచ్చా అని మీరడగవచ్చు. ఇంద్రియ నిగ్రహం కలిగి, నిరంతర దైవ చింతనలో వున్నవాడు తప్పు ఎలా చేయగలడు?

ఈ గుడి ఏదో కొంతమంది కలిసి కట్టింది – కానీ, మన దేహమనే ఆలయాన్ని, దేవుడొక్కడే స్వయంగా కట్టి యిచ్చాడు. కనుక ఈ దేహముండగానే సాధన చేసి, దాని లోపలనున్న నిజతత్వాన్ని తెలుసుకుంటే ఈ దేహమే దేవాలయము, జీవుడే సదాశివుడు అని తెలుసుకోగలుగుతాము. సదా ఆనంద స్వరూపులమై ప్రకాశిస్తాము. అప్పుడే దేహం

చెందే మార్పులకి గాని, ఎటువంటి సుఖదుఃఖాలకి గాని మనం చలించం. కేవలం శాస్త్ర జ్ఞానం మనని తరింపచేయలేదు. "నీకు గ్రంథాలలో భగవత్తత్వం దొరికితే, ఇసుక దిబ్బలో పడ్డసూది నాకు దొరకదా తాతా!" అని అడిగిన తాత మనుమరాళ్ళ కథ మనకు తెలిసినదే. అందుకే, శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు యీ విధంగా శెలవిచ్చారు

"అవిజ్ఞాతే పరే తత్త్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలాః।
విజ్ఞాతేపి పరే తత్త్వే శాస్త్రాధీతిస్తు నిష్ఫలాః॥

ఆ పరతత్వం తెలుసుకోకుండా, ఎన్ని శాస్త్రాలు చదివినా నిష్ఫలమే - పరతత్వం తెలుసుకున్నాక ఇక శాస్త్రాలెందుకు?

కనుక, సద్గురు దేవులనాశ్రయించి వారిచ్చిన లక్ష్యార్ధ సాధన సక్రమంగా చేసి, నిజతత్వాన్ని, సత్యాన్ని తెలుసుకుని సర్వులూ ఆనందస్వరూపులై వర్ధిల్లుదురు గాక! గురుపాదుకలు సర్వులను కాపాడుగాక!!

## ప్రేమ పారవశ్యము

ఒకసారి శ్రీకృష్ణుడు భక్తుడైన విదురుని యింటికి వెళ్ళాడు. ఆ సమయంలో విదురుడు యింట్లో లేడు. విదురుని భార్య స్నానం చేస్తూ ఉంది. శ్రీకృష్ణుడు పిలువగానే ఆమె కృష్ణ ప్రేమ పారవశ్యంతో వస్త్రాలు ధరించాలనే ధ్యాస కూడా లేకుండా వున్నపళంగా నగ్నంగా పరుగెత్తుకుని బయటకు వచ్చింది. ఇటువంటి పరిస్థితిలో పాపపుణ్యాల ప్రసక్తి ఉండదు. కృష్ణుడు చూసి ఆమెతో 'కనీసం వస్త్రాలు ధరించిరా ' అని చెప్పాడు. అప్పుడు ఆమె తనను చూసుకుని సిగ్గుపడి వస్త్రాలు ధరించి వచ్చింది.

ఆ సమయంలో విదురుడి యింట్లో తినటానికి ఏమీ లేదు. కేవలం కొన్ని అరటిపళ్ళు మాత్రమే ఉన్నాయి. విదురుని భార్య కృష్ణప్రేమలో ఎంతగా మునిగిపోయి ఉందంటే, ఆమె అరటిపళ్ళు వలచి. తొక్కలను శ్రీకృష్ణునికి అందిస్తూ, పండ్లను బయట పారవేస్తోంది. శ్రీకృష్ణుడు ఆ తొక్కలనే ఆనందంగా ఆరగిస్తున్నాడు.

ఇంతలో విదురుడు వచ్చి, ' పిచ్చిదానా! ఏమిటి నువ్వు చేసే పని? కృష్ణుడికి తొక్కలు తినటానికి యిచ్చి, పండ్లను బయట పారవేస్తున్నావు. తెలియటం లేదా?' అన్నాడు. అది విని ఆమె తేరుకొని 'అయ్యో! ఎంత పొరబాటు చేశాను. గమనించనే లేదు' అంది. అప్పుడామె శ్రీకృష్ణునికి పండును అందించింది. అప్పుడు శ్రీకృష్ణుడు 'విదురా! ఈ పండులో, మొదట తొక్కలలో ఉన్నంత రుచి లేదు సుమా ! ' అన్నాడు. ఇదే ప్రేమికుల స్థితి.

నిజమైన ప్రేమికులు, తన సద్గురువు పట్ల ప్రేమాతిరేకమున మైమరచి, అహం భావమును పూర్తిగా విడనాడి, అమర జీవనపు అమృతమును గ్రోలుచూ శాశ్వతమైన పరమానందాన్ని పొందుతారు.

-కొండ కాళీమాత

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

20-6-1985

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ నమ్ముకున్నవాడు బంగారు పిచ్చుక! నమ్ముకోనివాడికి బూడిదే! నిజమైన భక్తుడు భగవంతుడిపైన ఎట్టి పరిస్థితులలోనూ విశ్వాసాన్ని కోల్పోడు. దానినే దృఢమైన భక్తి అంటారు. దానికి సరితూగ గలది ఏమున్నది? భగవానుడు భక్తికి వశీకరణ అవుతాడు. నమ్ముకున్నవాడిని చేరదీస్తాడు. నమ్మనివాడికి కూడా చేరువలో ఉంటాడు. కాని వాడే భగవానుడికి దూరం అవుతాడు.

తమిళనాడులో మన భక్తులలో ఒక ఇంజనీరుగారి భార్య వ్యాధి గ్రస్థురాలైంది. డాక్టర్లు ఎంత ప్రయత్నించినా ఏమీ చేయలేక పోయారు. కాని ఆయన భార్య మాత్రం అధైర్యపడక భర్తని ఊరడించి నా గురించి భయపడవద్దు. మనల్ని రక్షించడానికి మన బాబు ఉన్నారు. ఆయన్ని ఒక్కసారి దర్శించి రండి అని భర్తని నా దగ్గరకు పంపింది. అదీ నిజమైన సంస్కారం అంటే. మాననవుడికి అంత సంస్కారం ఉండాలి గాని దానిని భగవంతుడు వమ్ము చేస్తాడా? తప్పక రక్షిస్తాడు అన్నారు శ్రీబాబు.



ఇంకా మాట్లాడుతూ, “మీకు ఒక దృష్టాంతం చెబుతాను. ఒక రాజుగారు వున్నారు. ఆయనకి ఒక్కగానొక్క కుమారుడు. ఆయనకి తన కుమారుడంటే చాలా ఇష్టం. అనుకోకుండా అతనికి చాలా ప్రమాదం జరిగింది. మరి వారి పుత్రుడిని ఎవరు రక్షించారు? ‘భగవంతుడా! మా పుత్రుడిని రక్షించాలి’ అని భార్యాభర్తలిద్దరూ ప్రార్థించారు. భగవంతుడికి తప్పుతుందా? భగవంతుడు డాక్టరులో శక్తిని ప్రవేశపెట్టి రక్షింపజేశాడు. డాక్టరుకి పెద్ద మొత్తంలో ధనాన్ని ఇచ్చారు. అసలు రక్షణ చేసినవాడికి 35పైసల కవరు కొని ‘మా పుత్రుణ్ణి మీరే రక్షించారు’ అని ఉత్తరం వ్రాశారు. ఎక్కడికక్కడే వెంకట లక్ష్మీ అని సంతృప్తి పడేవాడిని.

మీ హృదయబాబు మీ ధనధాన్యాల్ని ఎప్పుడైనా కోరాడా? నమ్మిన వాడికి రక్షణ చేసింది ఎవరో కనబడతాడు. నమ్మని వాడికి ఏం కనబడుతుంది? కనబడవలసినది కనబడదు. ద్రోణాచార్యుడు కౌరవ పాండవులకు ఒక పరీక్ష పెట్టాడు. ఒక చెట్టు చివర ఒక పక్షి ఉంది. దానిని వీక్షించమన్నాడు. కౌరవులందరికీ ఆ చెట్టు ఆకులు, రెబ్బలు గోచరించాయి. ఇంకా కొంచెం ఏకాగ్రత కుదిరిన వారికి పక్షి కనబడింది. వెంటనే

ద్రోణాచార్యుడు 'అర్జునా!' అని కేకవేసేసరికి అర్జునుడు వినయవిధేయతలతో గాండీవాన్ని ధరించి కృష్ణపరమాత్ముని మనస్సులో నిలిపి గురుమూర్తికి నమస్కరించి దృష్టి నిలిపేసరికి పక్షి కన్ను తప్ప ఏమీ గోచరించలేదు. అదే ఏకాగ్ర దృష్టి అంటే. 'వదులు బాణం' అన్నాడు ద్రోణాచార్యుడు. బాణం సరిగా కంటిని ఛేదించింది.

గురువు యందు విశ్వాసం కలిగినవాడు తెలుసుకుంటాడు. లేనివాడికి ఎంత బోధించినా తెలుసుకోలేడు. నేను అమెరికాలో ఫ్లోరిడాలో ఉన్నప్పుడు ఒక డాక్టరుగారికి, నాకూ 'భగవంతుడు ఉన్నాడా? లేడా?' అన్న విషయం మీద వివాదం వచ్చింది. మీరు భగవంతుణ్ణి చూడలేదు కదా! అన్నాను నేను. డాక్టరుగారు మాట్లాడుతూ అంటే నేను శక్తి హీనుణ్ణి అన్నమాట అన్నారు. మీ జేబులో అగ్గిపెట్టె ఉన్నది కదా! ఆ అగ్గిపెట్టెలో ఉన్న అగ్గి పుల్లలో తేజస్సు ఉంది అని నేను అంటాను లేదని మీరు అంటారు. అగ్గిపుల్లని అగ్గిపెట్టె మీద రాపిడి చేయకుండా అగ్గిపుల్లలో తేజస్సుని నాకు చూపించండి అన్నాను. ఆయన నా వంక క్రోధంగా, నిస్సహాయంగా చూశాడు. అలాగే ప్లగ్‌లో కరెంటు ఉందో లేదో మీరు చెప్పగలరా? ప్లగ్‌ని ముట్టుకోకుండా చెప్పాలి. కరెంట్ ఉన్న ప్లగ్ ముట్టుకుంటే ఏమవుతుంది! అప్పుడేనా మీకు కరెంట్ ఉన్నదని తెలిసేది?

మీకొక దృష్టాంతం చెబుతాను. మద్రాస్‌లో వెళుతూ ఉండగా నాతో ఒకడు ఢీ కొన్నాడు. ఏమయ్యా! కళ్ళు కనబడటం లేదా? అన్నాడు నన్ను. నేను వెంటనే ప్రశ్నించాను. నా సంగతి ఎందుకు? నీకూ ఉన్నాయిగా కళ్ళు మరి నీకు కళ్ళు ఉంటే నన్ను ఎందుకు ఢీ కొన్నావు? అన్నాను. అతను సమాధానం చెబుతూ నా నెత్తిన మూట ఉన్నది బాబు అందుకే కనబడలేదు అన్నాడు.

ఇంకొక దృష్టాంతం చెబుతాను. ఇద్దరు వ్యక్తులు సాయంత్రం 5గంటలకు వాదించుకొంటున్నారు. ఆకాశంలో నక్షత్రాలు ఉన్నాయని ఒకరు, లేవని మరొకరు. వున్నాయని వాదించే వ్యక్తిని చూపించమంటాడు రెండవ వ్యక్తి. ఇలా రెండు గంటల చర్చ జరిగిన తరువాత సూర్యాస్థమయం అయిన తరువాత అదిగో నక్షత్రాలు అని చూపించాడు. అక్కడితో వాదన ముగిసింది.

ఇన్ని విషయాలు విని మూడురోజుల తరువాత ఆ డాక్టరు ఎవరూ చూడకుండా ఏకాంతంగా నా దగ్గరకు వచ్చి మీరు చెప్పినదాంట్లో కొంత నిజం ఉన్నది అన్నాడు. చూశారా! మానవుడు అనుక్షణం ఆ చైతన్యాన్ని అనుభవిస్తూ దానిని లేదంటాడు. ఇది ఏమి న్యాయం చెప్పండి?" అన్నారు శ్రీబాబు.

*

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

***సెప్టెంబరు 2012***

5 బుధ టీచర్స్ డే ఉదయం 10 గం॥లకు శ్రీ సద్గురు పాద పూజ

10 సోమ శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

14 శుక్ర మాస శివరాత్రి

19 బుధ శ్రీవినాయక చవితి, ఉదయం 5గం.30నిలకు శ్రీ సద్గురు పాదపూజ. ఉ॥ 11 గం.లకు శ్రీవిఘ్నేశ్వరస్వామి సామూహిక పూజలు. భక్త సమారాధన.

29 శని పూర్ణిమ, శ్రీ సద్గురు పాద పూజ.

***అక్టోబర్ 2012***

10 బుధ శ్రీగురుదశమి సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ

13 శని శని త్రయోదశి, మాస శివరాత్రి

**<u>16 మంగళవారం నుండి, అక్టోబర్ 26 శుక్రవారం వరకు శ్రీదేవీనవరాత్రోత్సవములు</u>.**

ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్, మరియు శ్రీవెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీదేవీ భాగవత ప్రవచనము. మధ్యాహ్నము జగన్మాత కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన సాయంకాలము 6 గం.లకు ప్రార్థన, 7 గం.లకు జగన్మాత సాయంకాల పూజ, తీర్థ ప్రసాదములు.

16 మంగళ ఉ॥6-30ని॥ శ్రీమాతాజీవారి శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా దీక్షా స్వీకారము

17బుధ నుండి 24 బుధ వరకు ఉ॥ 9గం.ల నుండి ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారి అనుగ్రహభాషణము, మరియు ఆశ్రమ భక్తుల ఆధ్యాత్మిక ప్రసంగములు, శ్రీ గురుదేవుల దివ్య దర్శనము,బోధ (వీడియో), శ్రీబాబూజీ మహరాజ్ వాడినవస్తువుల మ్యూజియమ్ ప్రదర్శన (అర్థగంట).

20 శని మూలా నక్షత్రం.

21 ఆది సరస్వతీ పూజ, శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

22 సోమ దుర్గాష్టమి

23 మంగ మహర్నవమి. శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

24 బుధ విజయదశమి, నామకరణములు, అన్నప్రాశనలు, అక్షరాభ్యాసములు.

25 గురు ఏకాదశి, ఏకాహం, దీక్షావిరమణ, పూజాక్షతలు శ్రీమాతాజీ భక్తులపైన చల్లుతారు,రాత్రి 7 గం.లకు జగన్మాత ఊరేగింపు.

26 శుక్రవారం రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

27 శని శని త్రయోదశి.

29 సోమ పూర్ణిమ, శ్రీమాతాజీవారి 58వ జన్మదినోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

# నేత్రార్పణ చేసిన మహాభక్తుడు

-సుషుమ్న ప్రసాద

ఇలా జరుగుతుండగా ఐదవరోజున ఆగ్రహావేశుడైన పూజారి, ఒక పిచ్చివేటగాడు చేస్తున్న అపచారమును స్వామి సహించినందుకు కేకలు వేసి, నిరసనతో వెళ్ళిపోయాడు. ఆ రాత్రి పరమేశ్వరుడు పూజారికి స్వప్నములో సాక్షాత్కరించి, యిలా చెప్పాడు. “శివగోచరా! నాకు సేవచేస్తున్న వేటగాడు పిచ్చివాడు కాదు. నీవు అభిషేకించే పవిత్ర తీర్థముకన్నా, తిన్నడు పుక్కిట నింపుకొని వచ్చిన జలము నాకు చాలా హాయిగా ఉంటుంది. నీవు శుచిగా చేసిన పంచభక్ష్య పరమాన్నము కన్న, తిన్నన్ అర్పించే ఎంగిలి మాంసపు ముక్కలు చాలా రుచిగా ఉంటాయి. ఎందుకంటే నిష్కపటంతో, స్వచ్ఛమైన ప్రేమతో పునీతమైన ఆ ఆహారము నాకు చాలా మధురంగా ఉంటుంది. రేపు ఉదయం నీవు కొండమీదకు వచ్చి, తిన్నన్‌కి నాపై ఉన్న ప్రగాఢమైన ప్రేమను స్వయంగా చవిచూడు.

శివగోచర స్వప్నము నుండి మేలుకొని, స్వామి ప్రియ భక్తుని కలుసుకో బోతున్నాను అని ఉప్పొంగిపోయాడు. మరునాటి ఉదయం వడివడిగా కొండమీదకు వెళ్ళి, మాములుగా తన పూజ ముగించుకొని, యేమి జరుగుతుందో చూడటానికి చెట్టు వెనకాల దాక్కొన్నాడు. కొంతసేపటికి, ఒక వేటగాడు లింగమును సమీపించటం చూసి, నాకు స్వప్నంలో పరమేశ్వరుడు ప్రశంసించిన భక్తుడితడే కావచ్చు” అని ఆశ్చర్య చకితుడైనాడు.

తేజస్సుతో వెలుగొందే వదనంతో తిన్నన్ స్వామి వద్దకు వెళ్ళాడు. కాని లింగం కుడి కంటిలో నుంచి రక్తం కారటం చూసి, నిర్విణ్ణుడయ్యాడు. వెంటనే అతని భుజం మీద అంబులపొది ఉన్న బాణం, చేతిలో ఆకులో ఉన్న తాజా మాంసం క్రింద పడిపోయాయి. పరమేశ్వరునికెవరు యిలా హాని తలపెట్టారోనని తెలుసుకోలేక, కన్నీరు మున్నీరుగా విలపించాడు.ఆ రక్తాన్ని వస్త్రంతో తుడవటానికి ప్రయత్నించాడు. కాని రక్తధార ఆగలేదు. అప్పుడు కొన్ని మూలికలను తెచ్చి, గాయాన్ని మాన్పి, రక్తాన్ని అరికట్టాలని ప్రయత్నించాడు. కాని ప్రయోజనం లేదు. అప్పుడు తన కుటుంబ వైద్యుడు తరచుగా చెప్పే నానుడి గుర్తుకు వచ్చింది. శరీరంలో మాంసమునకు తగిలిన గాయాన్ని మాంసంతో మాన్పగలము అని. వెంటనే తన కంటిని ఊడపెరికి, లింగానికి అతికించాలి అనుకొన్నాడు. వెంటనే తిన్నన్ విల్లు సహాయంతో తన కంటిని ఊడబెరికి, రక్తధార కారుతున్న లింగం కంటివద్ద అతికించాడు. అద్భుతాల్లోకి అద్భుతం! తిన్నన్ యెంతో ఆనుందాన్ని , ఊరటను చేకూరుస్తూ కంటినుండి కారే రక్తధార ఠక్కున ఆగిపోయింది.

కానీ ఆ సంతోషం ఎక్కువ కాలం నిలువలేదు. ఎందుకంటే స్వామి ఎడమ కంటి నుండి రక్తం కారుతోంది. తిన్నడు దిగ్భ్రాంతి చెందాడు. వెంటనే విల్లు తీసుకుని, రెండవ కన్నును కూడా ఊడబెరకాలి అనుకున్నాడు. వెంటనే ఒక ఆలోచన వచ్చింది. రెండవ కన్ను తీయగానే తాను అంధుడైపోతాడు. అప్పుడు ఆ నేత్రాన్ని సరియైన ప్రదేశంలో అతకటానికి వీలులేదు. వెంటనే యిలా నిర్ణయించుకున్నాడు. తన ఎడమపాదాన్ని గుర్తుకోసం, పరమేశ్వరుడి నెత్తురుకారే నేత్రంపై నొక్కిపెట్టి, రెండవకన్నును తీయడానికి సిద్ధమయ్యాడు. తక్షణమే పరమశివుడు అతని ముందు ప్రత్యక్షమై గాఢాలింగనం చేసుకుని, 'నిలు కన్నప్పా!' అని మూడుసార్లు అన్నాడు. తమిళంలో నిలు అంటే ఆగు అని అర్థం. అప్ప అంటే అతికించే ప్రక్రియ అని అర్థం. అప్పటి నుండి తిన్నప్ప కన్నప్పగా ప్రసిద్ధి చెందాడు. ఈ కథనాన్నానంతా నిశితంగా గమనిస్తూ పూజారి శివగోచర చాల సిగ్గుపడి, పరమేశ్వరని ప్రియభక్తుని పాదాలకు సాష్టాంగ నమస్కారం చేశాడు.

అంతటి దృఢ భక్తి సంపన్నుడు కాబట్టి కన్నప్ప నాయనారు అనే ఉన్నత స్థితికి ఎదిగిన శైవ నాయనార్లలో ఒకడిగా ప్రసిద్ధి చెందాడు.

*

ది.3.8.2012న తెల్లవారుజామున హైదరాబాద్ శాఖా మందిర నిర్మాణ సందర్భంగా మండప పూజ జరిగిన దృశ్యం



# గురు కృపా హి కేవలమ్

- రమణ ప్రసాద్

గత సంచిక తరువాయి

'భలే మంచి చౌకబేరము' అనే పాట పాడి 'అండపిండ వేదండ సంతతులనెల్ల గుప్తగతి బొజ్జలో నింపుకున్న తోయజాక్షుని తులతూచగలవే? ధనముల, ధనేతరముల తరళనయనా!' అని పాడుతుంటే గురువుగారు అపరనారదులై మంగరాజుగారిని మాటలతో కవ్విస్తుంటే ద్వాపరయుగంలో తులతూగిన శ్రీకృష్ణపరమాత్మలాగ శ్రీబాబు చిరునవ్వు చిందిస్తూ దర్శనమిచ్చారు.

గురువుగారు నవ్వుతూ 'మంగరాజుగారూ! మానవుడికి తనవి అనేవి ఎన్ని ఉన్నా, అన్నిటికంటే విలువైనది ఈ శరీరమే కదా! కనుక మీరు అటువైపు కూర్చుంటే శ్రీబాబు ఉన్నవైపు పైకి లేవచ్చు. అప్పుడు మీ సంపదతోపాటు మీరు కూడా శ్రీబాబుకి స్వంతమైపోవచ్చు. శ్రీబాబు కలుగజేసుకుని "మంచి సలహానే యిచ్చావు. నీకైతే చూసుకోవలసిన సంసారం, పోషించుకోవలసిన పిల్లలూ, రక్షించుకోవలసిన స్థిరాస్థులూ, చరాస్థులూ ఏమీ లేవు కనుక తేలికగా చెప్పేశావు. ఆయనకు అవన్నీ ఉన్నాయి. ఆయనే నావాడైతే అవన్నీ ఎవరు చూసుకుంటారు?"

గురువుగారు 'ఎవరూ లేకపోవటమేమిటి? ఏమండీ మంగరాజుగారూ, అవన్నీ చూసుకోవటానికి ఎవరూ లేరా?' అంటూ శ్రీబాబు వంక చూపించారు. మంగరాజు గారు 'నాకు బాబుగారే ఉన్నారు' అన్నారు. కానీ త్రాసులో కూర్చోవటానికి సందేహించారు. గురువుగారు 'త్రాసులో కూర్చోవటానికి మీరు సందేహించారుకాని, మీరు కూర్చున్నా అది కదలదు. మీరే కాదు యీ ప్రపంచం అంతా తెచ్చి, ఆ ఎడమవైపు ఉంచినా యీ త్రాసు ముల్లు కదలదు. స్వామిని తూచగలిగేది భక్తి ఒక్కటే.

అలనాడు సత్యభామ పుట్టకుపుట్లు బంగారం పెట్టిన తూగని ఆ నంద కిశోరుడు రుక్మిణీదేవి భక్తితో ఉంచిన తులసీదళానికి తూగిన విషయం తెలియనిదా? అందువలన మనసారా భక్తితో ప్రార్థించుకుని ఒక్క తులసీదళాన్ని శ్రీబాబు దివ్యపాదారవిందాలకు తాకించి, ఆ పళ్ళెంలో వేయండి. ఆ పైన వారి అనుగ్రహం!' అన్నారు.

అలాగే ఒక తులసీదళాన్ని తీసుకుని మంగరాజుగారు శ్రీబాబు చుట్టూ ముమ్మారు ప్రదక్షిణం చేసి, భక్తి ప్రపత్తులతో ఆ తులసీదళాన్ని శ్రీబాబు పాదాలకు వుంచి నమస్కరించి శ్రీబాబు వంక చూశారు. శ్రీబాబు చిరునవ్వుతో ఆశీర్వదించారు. అప్పుడు మంగరాజుగారు ఆ దళాన్ని తీసుకుని కన్నులకు అద్దుకుని, ఎడమపళ్ళెంలో వేసారు. అంతే! భక్త సులభుడైన బాబుతో కుడివైపు పళ్ళెం పైకి లేచింది.

పద్నాలుగు లోకాలు బొజ్జలో యిముడ్చుకున్న పరమాత్ముడు భక్తితో వేసిన ఒక తులసీదళానికే తనకు తాను సమర్పింకునే భక్తసులభుడు! మంగరాజుగారు శ్రీగురుదేవులకు

సాష్టాంగ నమస్కారం చేసుకుని భక్తి ప్రపత్తులతో పాదపూజ చేసుకున్నారు.

ఇది ఆనాడు జరిగిన సంఘటనైతే ది. 6-1-2006 మాఘ పూర్ణిమనాడు నిడమర్రు గ్రామంలో మరొక అద్భుతం జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ఆనాడు శ్రీసద్గురుదేవుల పాదపూజ, సత్సంగ సమావేశం జరిగాయి. శ్రీమాతాజీ వారు తమ దివ్యబోధామృతాన్ని అందజేసారు. ఆ తరువాత దేవిరెడ్డి భీమసేన్ దంపతులు శ్రీమాతాజీవారిని భక్త సంక్షేమం కోసం కలకండతో తులాభారం వేస్తామని మొక్కుకున్నామీ, దానికి అనుమతినీయవలసినదనీ కోరగా వారు అనుమతించారు.

ఒక పెద్ద కాటా త్రాసుతెచ్చి అక్కడ పెట్టారు. శ్రీమాతాజీవారు కుడివైపు ధ్యానముద్రలో కూర్చున్నారు. ఎడమవైపు కలకండ వేశారు. ఎంతవేసినా తుల కదలలేదు. 121 కేజీల దాకా కలకండ వేశారు. అయినా త్రాసులో ఏ మాత్రం చలనం లేదు. శ్రీ భీమసేన్ దంపతులు భక్తితో మాతాజీవారికి నమస్కరించి 'అమ్మా! యిక తుల తూగేటట్లు చేసి, మా అందరికి శాంతిని కలిగించండి" అన్నారు. శ్రీమాతాజీ చిరునవ్వుతో ఆశీర్వదించారు.

శ్రీభీమసేన్ దంపతలు మాతాజీవారికి ముమ్మారు ప్రదక్షిణం చేసి ఒక తులసీదళాన్ని భక్తి ప్రపత్తులతో ఎడమవైపు త్రాసులో ఉంచారు. ఆశ్చర్యం! శ్రీమాతాజీ కూర్చున్న త్రాసు పైకి లేచింది. శ్రీమాతాజీ ముఖంపై దరహాస చంద్రికలు వెలిశాయి! భక్తులంతా జయజయ ధ్వానాలు చేశారు. శ్రీమాతాజీ తులతూగిన కలకండ భక్తులందరికీ ప్రసాదంగా యిచ్చారు. ఆశ్రమవాసులందరికీ కూడా ఆ ప్రసాదం లభించింది. అది ఎంత తియ్యగా ఉంది అంటే ..అది అనుభవైకవైద్యం!

తులసీదళమును వేయగా తులయును సమానమయ్యోగా
నీ సాటి గురువు యిలలోన లేరు నీ దరికి మమ్ము రానీ!



# శ్రీకృష్ణ కర్ణామృతం

గత సంచిక తరువాయి

- సుశీలా ప్రసాద

అది యమునాతీరం. అక్కడ చాలా చెట్లు చిగిర్చి పూసి, కాచి కళకళ లాడి పోతున్నాయి. ఎందరో నారీమణులు అక్కడ చేరి ఉన్నారు. కృష్ణుడు సరాసరివెళ్ళి పొగడచెట్టు తిన్నపైన కూర్చున్నాడు. 'చుక్కల్లో చంద్రునిలా ఉన్న వానిని చూస్తూ "ఇంత అందమైన వ్రజబాలుని చక్కదనం మగవాడినైన నన్నే యింత మురిపిస్తుంటే మరి యీ స్త్రీలంతా, అందునా వయస్సులో ఉన్న అందగత్తెలు ఆ మనోహరుని పొందుకోసం తపన పడరా, తహతహలాడరా' అనుకొన్నాను.

అప్పుడు బాల గోపాలుడు "ఏదీ ఒక పాట పాడు" అన్నాడు ఒక గోపమ్మను. "నేను నా గుండెల్లో నుంచి పొంగివచ్చే అనురాగాన్ని రాగంగా మలచి పాడతాననుకో. అది కేవలం యిక్కడ మన వరకే ఆనందం అందిస్తుంది. మరి నువ్వు పలికించే మురళీ నీ అధరామృతాన్ని చవిచూస్తూ జగమంతా దాన్ని పంచిపెడుతుంది కదా! అందుకని నువ్వే పాడు ప్రభూ! " అందాగోపిక.

"అదిగో! నా మురళీ గానాన్ని వినటానికే వచ్చాడీ గంధర్వుడు. అగ్నిజ్వాలలు ఆకాశానికి వ్యాపించినట్లుగా వ్రేపల్లెలో అవతరించింది. నేను చేసే లీలలు, మాయలు, నేను పాడే పిల్లన గ్రోవి రాగాలు గురించి దేవలోక వాసులంతా మురిసిపోతూ చెప్పుకుంటుంటే విని యితగాడికి నన్ను చూడాలని ఆశ కలిగింది. వివరాలన్నీ సేకరించి యితడు సరాసరి నా యింటి గుమ్మం ముందు వచ్చి నిలిచాడు" నల్లనయ్య మాటలు వింటూ విస్తుపోయాను. అన్నీ తెలిసినందుకే నన్ను చూసి ఎవరు నువ్వని అడగలేదు. నా చెయ్యి పట్టి నడిపిస్తే తన అడుగులు వెంట నడిచివచ్చాను.

'ఔను! నీ మనస్సులో అనుకున్నది నిజమే. ఈ తరుణులంతా ఎవరు అనుకుంటున్నావు? ఎన్నోవేల సంవత్సరాలు చేసిన తపస్సు పండిన మునీశ్వరులు. వైకుంఠవాసునిగా నన్ను దర్శించి, సన్నిధిలో నిలిచి స్తోత్రాలతో సన్నుతిస్తూ సంభాషణలు చేసినా నా స్పర్శా సుఖాన్ని మాత్రం అనుభవించనందున నన్ను మరీమరీ ప్రార్థించి నా అనుగ్రహంతో యిలా గోపీరమణులయ్యారు. జగత్తులో పురుషోత్తముడను. నేను నా సృష్టి అయిన ప్రకృతి సర్వం స్త్రీ రూపమేనని జ్ఞానం కలిగినవారు. నన్ను కర్త భర్త హర్తగా తెలిసి యిప్పుడిలాగ ఆరాధిస్తున్నారు. వారికి అందుకోనిది పొందలేనిది లేదు. ఇంక విను" చెప్పటం ఆపి వేణువును పెదిమిలపై నిలిపాడు.

షడ్జమ మధ్యమ రాగాలలో మాత్రమే మానవులు పాడగలరు. గానగాంధర్వం గంధర్వులమైన మా స్వంతం. ఆ గాంధర్వగానాన్ని అవలీలగా వేదసారమైన ప్రణవంగా పలికిస్తున్నాడు మాధవుడు. అది స్వలోకాలను పరవశింప చేస్తున్నది. మైమరచి వింటూ

అలాగే నిలిచిపోయి నేను తాను సర్వజగత్తు ఆ రాగ వాహినిలో ఏకమైపోగా 'చాలు యీ మధురాతి మధురమైన అనుభవం' అనుకొంటూ స్వామి మృదువైన పాదాలను అలవోకగా తాకి సెవలడిగి అశ్వముఖుడనైన నా రూపం బంగారు రెక్కలు విప్పి గగన వీధిలోకి ఎగిరిపోయాను. నాలో నింపుకొన్న అంతులేని నా యీ అనుభవ సంపదను మా లోకంలో అణువణువువా వెదజల్లుతాను. ఇది సత్యం శివం సుందరం!!

శ్లోక తాత్పర్యం –

పరిపూర్ణమైన అమృతాన్ని చిందుతున్న వేణుగాన ధ్వనులతో కూడి సుందర రూపముగల వారి లోపల పట్టాభిషిక్తుడైన చక్కనివారిలోకెల్ల మిక్కిలి చక్కనివాడైన శ్రీకృష్ణుని ఎప్పుడు చూస్తానో గదా !

ది.3.8.2012న తెల్లవారుజాము గం 4॥13 నిల॥కుహైదరాబాద్ శాఖా మందిర శంఖుస్థాపన చేస్తున్న శ్రీ మాతాజీ





******





శంఖుస్థాపన అనంతరం వాస్తుహెూమం జరుగుతున్న దృశ్యం

# పరిప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

శ్రీబాబూజీ మహరాజ్ హనుమాయమ్మగారిని "నీవు ఎవరవు'?" అని ప్రశ్నించారు.

ఆవిడ సమాధానం చెపుతూ 'నేను' అని సమాధానం చెప్పారు.

"నేను అంటే ఏమిటి?' అని శ్రీబాబు తిరిగి ప్రశ్నించారు.

'అసలు ఉన్నది ఒకే వస్తువు కదా!' అన్నారు హనుమాయమ్మగారు. శ్రీబాబు కలుగుజేసుకుని "మరి వీరంతా ఎవరు?" అంటూ అక్కడ ఉన్న భక్తులందరినీ చూపిస్తూ "ఏమిటయ్యా? అలా చూస్తూరేమిటి? నిరూపించమని అడగండి" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "ఇక్కడ ఉన్నవారందరిలో ఆత్మవస్తువు ఒక్కటే. అది రూమనామ క్రియారహితమైనదే. దానిచేత ప్రకాశింపబడే వస్తువులకి రూపనామ క్రియలు ఉన్నాయి కదా! అవే యివన్నీ. అయితే అన్నింటిలో ఉన్నది "నేను" అన్నదే. దానిని గుర్తించటానికి సాధన చేయాలి. దానిని గుర్తిస్తే సర్వత్రా అదే గోచరిస్తుంది. దానిని గుర్తించనంత వరకు యీ బంధుత్వాలు, బంధనలు తప్పవు కదా!

బ్రహ్మము జగత్తు అన్న భావనయే ద్వైతము. ద్వైత రూపంగా గోచరించేది మాయ. జగత్తంతా మానసిక దృశ్యం క్రింద పరిగణించాలి. సంకల్ప రహితమైనప్పుడు మానసిక జగత్తు గోచరించదు.

ఆత్మయే సత్యము అని దృఢ భావము కలిగినప్పుడు మనస్సు సంకల్ప వికల్పాలకు దూరము. అంతెందుకు? కన్ను మూసినా, నిద్రలోనైనా జగత్తు లేదుకదా! కన్ను తెరిస్తేనేగా జగత్తు.

కన్ను మూసినప్పుడు యీ జగత్తు లేదు, బంధములు లేవు, బంధుత్వాలు లేవు. అయినా ఈ ఉపాధి ఉన్నంతవరకే కదా. అంతమాత్రానికి ఎందుకయ్యా నీది నాది అని తగవులాడుకుంటారు. అంతా నాదే అనుకోండి. యదార్థం అంతేకదా! దీనిని అర్థం చేసుకోండి" అన్నారు శ్రీబాబు.

*

# శివానంద లహరి

-బులుసు మల్లిక్ **USA**

8. శ్లో॥ యథాబుద్ధిః శుక్తౌ రజతమితి కాచాశ్మనిమణిః
జలే పైష్టే క్షీరం భవతి మృగతృష్ణాసు సలిలం
తథా దేవ భ్రాంత్యా భవతి భవదన్యం జడజనః
మహాదేవేశం త్వాం మనసి చ న మత్వా పశుపతే ॥

ఈ శ్లోకంలో శంకరులు మిడిమిడి జ్ఞానం చేతసత్యాసత్యాలలో వ్యత్యాసాన్ని గ్రహించలేనట్టి సాధకుల కష్టాన్ని సదాశివునికి మొరపెట్టుకుంటూ *పశుపతే!* అని సంబోధిస్తున్నారు. ఈ పశుపతి అన్న నామము చాలా విశిష్టమైనది. ముఖ్యంగా రుద్రాధ్యాయంలో రెండవ అనువాకంలో *పశూనాం పతయే నమః* అని చెప్పబడింది. ఏవి పాశాలతో కట్టబడ్డాయో అవి పశువులు. ఉదాహరణకి ఒక ఆవుని చూడండి. మనం కావాలని ప్రయత్న పూర్వకంగా తాటితో రాటికి కట్టిపెడతాం. ఎందుచేతంటే పశువులకి ఏది ప్రమాదమో, ఏది కాదో తెలియదు కాబట్టి. క్రూరమృగాల కంట పడితే ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. అంటే యీ జంతువులు పాశాలచేత రక్షించబడ్డాయి. అటువంటి పశువులను సయితము రక్షించే కారణం చేత 'పశుపతి'. అయితే మందబుద్ధిగల మనిషో! అతడు కూడా నిజానికి ఒక వింత పశువు. తన తెలివితేటలతో తాను ఇంద్రియాలను విషయవస్తువులకు కట్టిపెట్టుకొంటున్నాడు. ఇదే ధ్యాన విముఖతకి దారి తీస్తుంది. శివానందానుభూతిని దూరం చేస్తుంది.

దీనికే శంకరులు మందస్తుగా ***యథా బుద్ధిః శుక్తౌ రజతమితి*** అంటున్నారు. ఉదాహరణకి బుద్ధి యంత్రం పొరబాటుకులోనై ముత్యపు చిప్పని వెండియని భావిస్తుంది. ఓ చిన్నపిల్లవాడు ఓ పండుగ రోజున వెండిపళ్ళెములో అన్నం పెడితే 'ఇదేంటమ్మా! ఈ పళ్ళాన్నెప్పుడూ చూడలేదే' అంటాడు. అప్పుడు తల్లి 'ఇది వెండి పళ్ళెంరా. చాలా విలువైనది' అని చెబుతుంది. ఆ పళ్ళెం రంగుని గ్రహించిన కుర్రాడు కొన్ని రోజుల తరువాత యిసుకలో ఆడుకుంటూ ముత్యపుచిప్ప పెంకుని పట్టుకుని యిది ఖచ్చితంగా వెండని సంబరంతో తల్లి దగ్గరకు పరుగు పెట్టి వెడితే, లేదురా పొరబడ్డావని, పొరపాటును సరిచేస్తుంది.

అలాగే ***కాచాష్మమణిః*** అంటారు శంకరులు. గాజురాయిని చూసి మనం మణి యనో, వజ్రమనో భ్రమిస్తాం. ఒక్కొక్కసారి గాజుపెంకులే ధగధగ మెరిసే రంగురాళ్ళవలే భాసిస్తాయి. అదే నిజమనుకుని షరాబు దగ్గరకి పరుగెట్టుకుంటూ వెళ్ళి చూపించామనుకోండి. సంగతి బయటపడుతుంది. అతడు అసలుసిసలైన వజ్రాన్ని తీసుకుని గాజుపెంకు మీద గీసిన వెంటనే అది గాజు ముక్కలైపోతుంది. అదే కనుక

నిజమైన వజ్రమైతే చెక్కుచెదరదు గదా!

***జలే పైష్ఠే క్షీరం*** అని మరో ఉదాహరణ ముందుకు తెస్తున్నారు శంకరులు. అంటే పిండి కలిపిన నీళ్ళని పాలని అపోహకు గురౌతున్నాడట వేరొకడు. అదే కొంచెంసేపు ఆగి చూస్తే పిండికి పిండి, నీళ్ళకు నీళ్ళు వేరై, నిజం తేటతెల్లమవుతుంది. అప్పుడు నిజాన్ని గ్రహిస్తాడు.

ఆఖరుగా ***మృగతృష్ణాసు సలిలం భవతి*** అంటున్నారు శంకరులు. బాగా ఎండలో కష్టపడి పనిచేసి దాహంతో బాధపడుతూ సేదతీర్చుకుందామని కుండ దగ్గరకి పరిగెడతాడు. అయితే ఖాళీ కుండను చూసేసరికి తప్పిక రెట్టింపు అవుతుంది. ఏమీ తోచక అటూయిటూ పరుగు పెడుతుంటే దూరంగా చెరువులాగా కనిపిస్తుంది. దాని దగ్గరకు వెళ్ళే ప్రయత్నం చేస్తాడు. వాడెంత దూరం వెడితే, ఆ చెరువు కూడా అంతే దూరం పరుగెడుతూ కనిపిస్తుంది. ఈ అవస్థను గ్రహించిన పెద్దాయన ఒకడు 'అది ఎండమావు నాయనా! నీరుకావాలంటే అదిగో ఫలానా బావి దగ్గరకి వెళ్ళు. నీ దప్పిక తీరుతుంది' అని చెబుతాడు.

***తథా దేవ భ్రాంత్యా భజతి భవదన్యం జడజనః*** అని అంటారు శంకరులు. దైవం విషయంలో కూడా యిదే విధంగా జడమనస్కుడు భ్రాంతికి లోనై అన్యుల్ని దైవంగా భావిస్తూ, భజిస్తున్నాడట. ఎందుచేతంటే ఎరుకలో లోపం చేత. లక్ష్యంలో లోపం చేత. అలాగే ధ్యానంలో లోపం చేత. దీనికే ***మహాదేవేశం త్వాం మనసి చన న మత్వా*** అంటారు శంకరులు. అంటే దేవదేవుడైన ఆ సదాశివుని విస్మరించి, లౌకిక ఫలాలని ప్రసాదించే అన్యుల చింతనలో జీవుడు కాలయాపనం చేస్తున్నాడు.

మరి దీనిని ఎలా సవరించుకోవాలి? మానసోల్లాసం.'***ఇంద్రియాణాం సమస్తానాం విషయేభ్యో నివారణం ప్రత్యాహార ఇతి ప్రోక్తం*** అని అంటోంది. ప్రమాదం నుంచి బయటకు పడాలంటే ముందస్తుగా ' ఇంద్రియాలను విషయవస్తువుల దాడి నుండి కాపాడుకోవాలి. అటుపిమ్మట **ఆధారే క్వాపి మనస స్థాపనంధారణోచ్యతే** అంటే సత్యవస్తువు యొక్క ధారణ వైపుకి మనస్సుని మళ్ళించాలి. ***బ్రహ్మవిష్ణు శివాదీనాం చింతా ధ్యానం ప్రచక్షతే*** అంటే సర్వకాల సర్వావస్థల యందు కేవలం బ్రహ్మవిష్ణు శివాదులలో ఏదో ఒకరివైపు మనస్సుని కేంద్రీకరించుకొని కాలాన్ని వెళ్ళబుచ్చుకోవాలి.

చివరిగా అపోహ తొలగాలంటే జ్ఞానోదయం కావాలి. అది గురుకృపతో మాత్రమే సాధ్యమవుతుంది. దీనికే గుర్వష్టకంలో శంకరులు ***గురోరంఘ్రిపద్మే మనశ్చేన్నలగ్నం తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్ తతఃకిమ్*** అంటారు. అంటే సద్గురువును ఆశ్రయించాలి. గురువు బోధలను పాటించాలి. దానిచేత భ్రాంతి పటాపంచలవుతుంది. శివానుగ్రహం మన కరతలామలకమౌతుంది. ఇది తథ్యం!!

# స్థిత ప్రజ్ఞస్య కా భాషా?

- రమణ ప్రసాద్

భగవద్గీత ద్వితీయోధ్యాయం సాంఖ్యయోగంలో అర్జునునితో "నీకు యీ మోహం ఎట్లా దాపరించింది? ***క్లైబ్యం మా స్మ గమః పార్థ*** – ఓ అర్జునా! పిరికితనానికి లోనుకావద్దు. నీ హృదయ దౌర్బల్యాన్ని విడిచి, యుద్ధానికి సన్నుద్ధుడవు కా! " అని నిర్దేశిస్తాడు. ఈ అధ్యాయంలో శుద్ధ ఆత్మతత్త్వ విజ్ఞానం భగవానునిచే చెప్పబడింది.

అర్జునుడు ' పిరికితనం వల్ల నా స్వభావాన్ని కోల్పోతున్నాను. ధర్మాధర్మ విచక్షణ దూరమైంది. కర్తవ్య విమూఢునయ్యాను. నేను నీ శిష్యుడను. శరణాగతుడను. నాకు శ్రేయస్కరమైనదాన్ని ఉపదేశించు' అని ప్రార్థిస్తాడు.

ఈ అధ్యాయంలో ఆత్మానాత్మ వివేకం గురించి చెప్పబడింది. ఆత్మ నిత్యం. ప్రపంచం అసత్యం. ఆత్మ కనిపించాలి అంటే నీ బుద్ధి శుద్ధంగా ఉండాలి. చూడండి కుండలో నీరు మలినంగా ఉంటే ముఖం కనిపిస్తుందా? అద్దం దుమ్ము పట్టి ఉంటే నీ ముఖం సరిగ్గా చూసుకోగలవా? హిరణ్యకశిపుడు అహంకార పూరితుడై 'ఎక్కడ వున్నాడు హరి?' అని ప్రశ్నించాడు. ప్రహ్లాదుడు శుద్ధబుద్ధి కలవాడు కనుక 'ఎక్కడలేడు హరి?' అని సమాధానం యిచ్చాడు.

అర్జునా! నీవు మోహమనే ఈ ఊబి నుండి బయట పడినప్పుడు వైరాగ్యవంతుడవు అవుతాడు. అనాసక్తిగా చేసే కర్మ యొక్క ఫలం నీకు అంటదు. రజోగుణ యుక్తంగా చేసే కర్మయొక్క ఫలం బంధాన్ని తెస్తుంది. తమోగుణంతో చేసే కర్మ ప్రమాదాన్ని తెస్తుంది. కర్మఫలం లేకుండా పోవాలంటే నిష్కామకర్మ చెయ్యి. కర్మ చేయవలసిందే. కర్మచేయకుండా ఉండలేవు. ***న కశ్చిత్ క్షణమపి*** – సత్వగుణంతో చేసే కర్మలో ఫలాసక్తి ఉండదు.

అర్జునుడు ఋజుప్రవర్తన కలవాడు. శ్రీకృష్ణుడిని యిలా అడిగాడు –

***స్థితప్రజ్ఞస్య కా భాషా, సమాధిస్థస్య కేశవ।***
***స్థిత ధీః కిం ప్రభాషీత కిమాసీత వ్రజేత కిమ్॥***

' ఓ కేశవా! స్థిత ప్రజ్ఞుని లక్షణాలు ఏమిటి? అతడు ఎట్లా భాషిస్తాడు? ఎలా కూర్చుంటాడు? ఎలా నడుస్తాడు?' అని అడిగాడు.

దానికి సమాధానంగా భగవానుడు...........

***ప్రజహాతి యదా కామాన్, సర్వాన్ పార్థ మనోగతాన్।***
***ఆత్మన్యేవాత్మనా తుష్టః స్థిత ప్రజ్ఞ స్తదోచ్యతే ॥***

"ఓ అర్జునా! ఎవరికి మనస్సులోని కోరికలన్నీ తొలగిపోయి, ఆత్మ ద్వారా ఆత్మయందు సంతుష్టుడైనవాడు అనగా పరమాత్మ సంయోగం చేత ఆత్మానందం పొందినవాడు

స్థితప్రజ్ఞుడు." అని చెప్పాడు. మనస్సులో కోరికలు తీసివేస్తే మనస్సు అమనస్కం అవుతుంది. నూలు యొక్క సంపుటి వస్త్రం. వస్త్రంలోని నిలువుగా అడ్డంగా ఉన్న నూలు తీసివేస్తే వస్త్రం ఉండదు. స్థితప్రజ్ఞుని మనస్సులో కామం ఉండదు. జ్ఞానం కలగగానే కోరికలన్నీ పలాయనం చిత్తగిస్తాయి. దీనిని విధ్వంసక పద్ధతి అంటారు.

***గీతా గంగ పీత్వా పునర్జన్మ న విద్యతే.*** గీతామృతం నీలో ప్రకాశిస్తే నీ జన్మకు కారణమైన అవిద్య తొలగిపోతుంది. అర్జునుడు గీతామృతాన్ని గ్రోలాడు. అతనిలో మోహం నశించింది. స్మృతిని పొంది సంశయ రహితుడయ్యాడు. అతనిలో అజ్ఞానం తొలగిపోయింది.

అర్జునుడు 'స్థిరమైన ఆత్మయందు ప్రజ్ఞ కలవాడు ఎలా ఉంటాడు?' అని ప్రశ్నించాడు.

దానికి భగవానుడు ***ప్రజహాతి యదా కామాన్ సర్వాన్*** – అన్ని కోరికలను లెస్సగా విడిచినవాడు, అది కోరికలు తొలగిన స్థితి సిద్ధావస్థ. ముందు శుద్ధ కోరికలు పెట్టుకో. తరువాత వాటిని కూడా వదిలివెయ్యి. మంచి కోరిక ఎంత ప్రతిబంధమో. చెడ్డ కోరిక కూడా అంతే ప్రతిబంధం. ఒకటి బంగారు గొలుసు అయితే యింకొకటి యినుప గొలుసు. కాబట్టి అన్ని కోరికలను విడిచిపెట్టాలి. ఈ విధంగా కోరికలను తొలగించే పద్ధతి విధ్వంసక పద్ధతి.

– సశేషం

## భజన – స్మరణ మహాత్మ్యం

మహాత్ముడైన జనకమహారాజు దేహం చాలించి, నిజధామానికి వెడుతున్నప్పుడు దారిలో నరక లోకంలో వర్ణింపనలవికాని బాధలను అనుభవిస్తున్న ఆత్మల హాహాకారములు వినిపించాయి.

వెంటనే ఆయన ఆగి, అక్కడగల యమదూతలను 'ఈ ఆత్మలను ఎందుకు కష్టపెడుతున్నారు?' అని ప్రశ్నించాడు. వారి నుండి జవాబు రానందువలన, 'ఈ ఆత్మలకు యాతనల నుండి విముక్తి ఎలా కలుగుతుంది?' అని యమధర్మ రాజును ప్రశ్నించాడు. దానికి యమధర్మరాజు 'ఎవరైనా మహాత్ముడు తన భజన ఫలితాన్ని అర్పిస్తే, ఆ ఆత్మలకు విడుదల కలుగుతుంద'ని చెప్పాడు.

అది విని జనక మహారాజు తన రెండున్నర గంటల భజనఫలితాన్ని అర్పించగా, ఆ ఆత్మలన్నీ నరకాల నుండి విడుదల పొంది మర్త్యలోకానికి వచ్చి మానవ జన్మలను పొందాయి. గురువు తన యొక్క శిష్యుడు ఎట్టివాడైనాసరే అతనిని నరకమునకు పోనీయడు.

–కొండ కాళీమాత

# చిన్న చీమ కథ

– సుశీలా ప్రసాద

"శివుడికి మూడు కళ్ళుంటాయి. విబూది రాసుకుంటాడు. పాములే నగలుగా ధరిస్తాడు. పులితోలు కట్టుకుంటాడు. అమ్మ పూజామందిరంలో ఉన్న శివుణ్ణి చూస్తే ఏమీ డబ్బులు లేనివాడిలా కనిపిస్తాడేం నాన్నా!" పెద్దాయన్ని చిన్న కుర్రాడు అడుగుతున్నాడు. "ఒరే చిన్నా! తనకేమి లేనట్లు కనిపించినా, బోలెడు డబ్బున్న స్నేహితుడు, అందరికీ డబ్బు యివ్వగల గొప్ప చెల్లి ఉన్నారు. అసలు తను తల్చుకుంటే అడిగిన వారికి లేదనుకుండా కావలసినవన్నీ యివ్వగలడు. అయితే ఆయన్ను మెప్పించేటట్లు వినయంగా భక్తిగా ప్రార్థించాలి. తెలిసిందా? అంత మహిమ గల వాడు మహాదేవుడు" అంటున్న పెద్దాయనతో "తల మీద చందమామ, బోలెడు నీళ్ళు కూడా ఉన్నాయి కదా!" అన్నాడు చిన్నవాడు. "ఔను చందమామంతా చల్లగా ఉండి నీళ్ళతో నిండిన గంగమ్మవంటి దయారసాన్ని అందిస్తుంటాడురా!"

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూ కూర్చున్న కుర్చీల పక్కగా నేలమీద ఒక చిన్న చీమ సేద తీరుతున్నది. అది నల్లది. ఎర్రదానికి మల్లే కుట్టే స్వభావం కానిది. తన మానాన తన పనేదో చేసుకుపోయే స్వభావం గలది. ఎవరో పంచదార డబ్బాలో దూరిన నల్ల చీమలను అన్నిటినీ దులపటానికి బైట ఎండలో పడేశారు. కంగారు కంగారుగా డబ్బాలో నుంచి దిగి ఎండలోపడి కాళ్ళు కాల్చుకున్నాయి ఆ నల్ల జీవులన్నీ. అలాగ కాళ్ళు కాలి యింట్లోకి వచ్చి కుర్చీల పక్కన సొమ్మసిల్లి పడి ఉండగా, ఇదిగో ఈ శివుడి గురించిన సంభాషణంతా విన్నది.

ఆ దేముడి తలమీద చల్లని నీళ్ళు ఉన్నాయని విని దానికి మండే ఎండలో కాలిన తన కాళ్ళు గుర్తుకొచ్చాయి. చక్కగా ఆ నీళ్ళలో వేడంతా పోయేట్టు స్నానం చేయగలిగితే ఎంత బాగుండు! తీరా ఆ నీళ్ళలో అడుగుపెడితే మునిగిపోతే చచ్చిపోరూ? ఏమీ కాదు. ఆయన దేముడు. ఎన్నో మహిమలు గలవాడు అని యిప్పుడేగా విన్నది. పైగా వినయంగా ప్రార్థిస్తే కోరిక తప్పకుండా తీరుస్తాడు అని కూడా ఆ పెద్దాయన చెప్తున్నాడు. ఇంకేం ! చిన్న చీమకి పెద్ద కోరిక కలిగింది. ఆ శివదేవుడి తల మీద గంగ నీళ్ళలో స్నానం చేయాలని.

అది ఎలా కుదురుతుంది? తనకి అంత అర్హత ఉందా? ఏమో! దేవుడికి తన మీద దయగలిగితే తన కోరిక తీర్చడా? పట్టుబట్టాలి. తీరేదాకా వదలకూడదు. వున్నచోటు నుంచి లేచింది. ఒళ్ళు దులుపుకుని ముందుకు నడిచింది. నడుస్తుంటే తోటి చీమ ఎదురైంది. "ఇదిగో! చూశావా ? నేను శివుడి తల మీద గంగలో స్నానం చెయ్యబోతున్నాను" అంది మెల్లగా దృఢంగా. ఆ చీమకేమీ అర్థం కాలేదు. "నువ్వు చెప్పింది నాకేమీ తెలియలేదుగాని, నువ్వు జాగ్రత్తగా చూసుకుని నడు. లేకపోతే ఎవరి

కాలికిందో పడి అణిగిపోతావు" అంటూ రెండో చీమ చకచకా వెళ్ళిపోయింది.

చిన్నచీమకి మనస్సులో కోరిక బలమైపోయి దాన్ని నిలవనివ్వటం లేదు. నడుస్తూ వెళ్ళి పక్కనే ఉన్న తోటలోకి వెళ్ళింది. అక్కడ తనకి దోవ దొరికింది. గుళ్ళో పూజ చేసే పూజారి పువ్వులు కోస్తున్నాడు. చీమ తలలో మెరుపులా మెరిసింది ఆలోచన. మునుపొకసారి తను ఆ పూలలోనే తేనె తాగటానికి దూరితే, ఆయనే దులిపి దులిపి పూలను తీసుకుపోయాడు. పువ్వులో నుంచి జారి క్రిందపడి నడుం నొప్పి పెట్టింది కూడా తనకి. ఆ పూలను ఏం చేస్తున్నాడా అని తొంగి చూస్తే అవన్నీ పూజ చేస్తున్నాడు. ఇప్పుడా పువ్వులనే ఆశ్రయించాలి. అనుకున్న వెంటనే చీమ చెట్టెక్కి, కొమ్మలెక్కి ఆ చివర్న ఉన్న పువ్వులోకి వెళ్ళి కూర్చుంది. ఇప్పుడు తన పని తేనె తాగటం కాదు. ఆ పువ్వుని కోసి పూజచేస్తే, తను ఆ దేవుని సన్నిధికి చేరుకోవచ్చు అని ఆలోచన. చీమకి ఆనందమైంది. మైమరపు కలిగింది. ఆ పువ్వుని అంటిపెట్టుకుని కళ్ళు మూసుకుని దేవుడా! నా కోరిక తీర్చు అని పదేపదే అనుకోసాగింది.

తను ఎవరికీ ఎప్పుడూ ఏ హాని చెయ్యలేదు. తన కోరిక మంచిదేగాని చెడ్డది కాదు అని అనుకుంటూ ఉంది. ఒకవేళ అర్చకుడు పువ్వుని దులిపినా తను పట్టు వదలకుండా పువ్వుని అంటిపెట్టుకునే ఉండి స్వామి దగ్గరకి వెళ్ళవచ్చుననే ఆశలో వుంది చీమ. అర్చకుడు పువ్వుని కోశాడు. వాని కంటబడకుండా ఆ పెద్ద పువ్వు రేకుల్లో దాక్కుంది. ఆయన సరాసరి గుళ్ళోకి వెళ్ళాడు. అర్చన మొదలు పెట్టాడు. చీమ గుండెలు గుబగుబలాడాయి. స్వామి ముందు నుంచుని చేత్తో పువ్వులు విసురుతున్నాడు ఆయన. దేముడి మీదకి. తీరా తను ఆశ్రయించిన పువ్వుని అజాగ్రత్తగా పడేస్తాడా! భయంతో కళ్ళు మూసుకుంది. కాని చీమ అనుకున్నట్లు, భయపడినట్లు కాకుండా అర్చకుడు అతిజాగ్రత్తగా ఆ పువ్వుని పట్టుకుని శివుని తలమీద అలంకరించాడు. చిటుక్కున చీమ కళ్ళు తెరిచి చూసింది. తన కెదురుగా చందమామ, పక్కగా గంగమ్మ! చీమ పొందిన బ్రహ్మానందాన్ని వర్ణించటానికి వీలులేదు. "స్వామీ! దయామయుడవైన నీకు నా వేలవేల నమస్కారాలు. అంతకన్న ఏమియివ్వగలను?" అంటూ ఒక్క గెంతులో గంగలో దూకింది. ఇప్పుడు దానికి చనిపోతానని భయం లేదు. ఎందుకంటే అది అమృత ప్రవాహం. చిన్నచీమ జన్మ ధన్యమైనది.

శివదేవుని పెదవులపైన మధురమైన మందహాసం మెరిసింది. పిపీలికాది బ్రహ్మపర్యంతం సకల రూపాలూ తనవే. మేనులో సగమైన పార్వతి కూడా ముక్కున వున్న ముత్యపు ముక్కెర వెనక నుంచి మధురాతి మధురంగా నవ్వింది. ఒక జీవి కోరిక తీర్చినందుకు కలిగిన తృప్తితో. సాధనలో ఉన్నత స్థితికి ఎదగటానికి పట్టుదల విశ్వాసం సాధకునికి ఎంతో అవసరం!

*

# తారక విద్య

-శ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామి

పూర్వము ఒక పండితుడు, సర్వ విద్యాపారంగతుడు పాదచారియై యాత్రచేసుకుంటూ పోతున్నాడు. దారిలో ఒక నది అడ్డంరాగా దానిని దాటవలసి వచ్చింది. నదిలో నీరు వెల్లువలై ప్రవహిస్తోంది. ఒడ్డున ఒక బెస్తావాడు చిన్న పడవ పెట్టుకుని కూర్చుని ఉన్నాడు. ఆ పండితుడు వానితో సంభాషించి, ఆవలి ఒడ్డుకు పోవటానికి ఏర్పాటు చేసుకున్నాడు. ఇద్దరూ పడవలోకి ఎక్కారు. బెస్తావాడు పడవను నడుపుతున్నాడు.

పండితుడు దీర్ఘాలోచనా తత్పరుడయ్యాడు. ఏమి ఊహ కలిగిందో కాని, హఠాత్తుగా ఆ పల్లెవాడిని పిలిచి, 'ఓయీ! తర్కవిద్యని ఏమైనా అభ్యసించావా?' అని అడిగాడు. బెస్తావాడు పడవ నడుపుతూ 'లేద' ని సమాధానం చెప్పాడు. ఆ తరువాత వారిద్దరి మధ్య యీ క్రింది విధంగా సంభాషణ జరిగింది.

*పండితుడు* – ఛీ! ఛీ! తర్కవిద్యని నేర్వని జీవితం కూడా ఒక జీవితమేనా? అట్టి అపూర్వ విద్య నేర్చుకోనందువల్ల నీ జీవితంలో ఒక పాతిక భాగం వ్యర్థమైపోయిందని నేను తలుస్తున్నాను. ఇప్పటికైనా నా బోటివారి వద్ద నేర్చుకుని బాగుపడు! అది సరేకాని మిమాంస ఏమైనా చదివావా?

*బెస్తావాడు* – బాబూ! మిమాంస సంగతి నాకు ఏమీ తెలియదు కాని, మా మాంసం గురించి మాత్రం తెలుసు.

*పండితుడు* – ఓరి వెఱ్ఱివాడా! మిమాంస నేర్చుకొనని వాడెవడైనా ఉంటాడా? అది నేర్చుకోనందు వలన నీ జీవితంలో ఇంకో పాతిక భాగం వృథా అయిందని నేను భావిస్తున్నాను. పోనీ, జ్యోతిష్యము చదివావా?

*బెస్తావాడు* – బాబూ! అది అంతకంటె నాకు చేత కాదు.

*పండితుడు* – నారాయణ! నారాయణ! జీవితంలో యింకొక పాతిక భాగం నాశనం చేసుకున్నావు కదరా వెఱ్ఱివాడా! తర్క, మిమాంస, జ్యోతిష్య శాస్త్రములు తెలియని వాడు ముప్పాతిక జీవితం దండుగ చేసుకొన్నట్లే అని గ్రహించు!

ఈ ప్రకారం వారిద్దరి మధ్య సంభాషణ జరుగుతుండగా పడవ సరిగ్గా నదీమధ్య భాగమునకు చేరింది. నీటి ప్రవాహం చాల వడిగా ఉంది. ఇంతలో పెనుగాలి వీస్తోంది. తుఫాను చెలరేగింది. నదీజలము ఉత్తుంగ తరంగ సంయుక్తమై భీతిని గొల్పుతోంది. పడవ తరంగాల తాకిడికి ఊయలలూగుతోంది. ఇంతలో పడవలోకి నీరు ప్రవేశించింది. తత్ఫలితంగా పడవ నీటిలో మునిగిపోవవచ్చింది.

ఆ ఘోర విపత్సమయంలో బెస్తావాడు పండితుణ్ణి పిలచి 'అయ్యా! తమకు యీత వచ్చునా?' అని అడిగాడు. ఆ పండితుడు 'రాదు' అని సమాధానం చెప్పాడు. అది విని బెస్తావాడు 'మహాప్రభూ! తర్క, మిమాంస, జ్యోతిషములు చదవనందున నా జీవితంలో మూడువంతులు నాశనం అయింది. కాని 'ఈతవిద్య' రానందున తమ జీవితం యిప్పుడు మొత్తము నూటికి నూరు శాతము నాశనమైపోయింది' అని పలికి ఊరకున్నాడు.

ఇంతలో పడవ మునిగిపోయింది. పండితుడు గంగార్పణ మయ్యాడు. బెస్తావాడు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. చూశారా ! నదీప్రవాహం మధ్యలో కావలసిన విద్య ఏది? ఈతవిద్య. ఆ సమయంలో తర్క, మిమాంస, జ్యోతిషలుగాని, హిస్టరీ, జాగ్రఫీ, జ్యామెట్రీ గాని ఏదియు జీవుని రక్షింపలేదు. మునిగిపోయే వాడికి ఈతవిద్య ఒక్కటే శరణ్యము.

అట్లే జీవుడు సంసార సాగరం మధ్యలో గ్రుంకులిడుతున్నాడు. అట్టివానికి తరణోపాయం బ్రహ్మవిద్య ఒక్కటే. అక్షర పరమాత్మ తత్త్వమే. ఆ విద్య ఒక్కటే జీవుణ్ణి తరింపజేయ గలదు. కనుకనే దానికి *తారక విద్య* అని పేరు వచ్చింది. భవదుఃఖ శమమునకు మానవుడు దానిని తప్పక పరిగ్రహించాలి.

**నీతి** – *నదిని దాటటానికి ఈత అవసరమైనట్లే, సంసారాన్ని దాటటానికి బ్రహ్మవిద్య అవసరము. కాబట్టి దానిని బడయటానికై జీవుడు ప్రయత్నించాలి.*

*

## శ్రద్ధాంజలి

ఆశ్రమ స్థిర నివాసులు, పరమభక్తులైన ఈవూరి రమణారెడ్డి (హిందీమాస్టారు గారి ఏకైక కుమారుడు) ఆకస్మికముగా 28-6-2012 శనివారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 49 సంవత్సరాలు. వీరికి తల్లి,ఇద్దరు చెల్లెళ్ళు కలరు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# అమృతాభిషేకం

-కృష్ణ లాల్

(1982లో విజయవాడలో జరిగిన సత్సంగ సమావేశంలోని శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీ వర ప్రసాద బాబూజీ వారి బోధామృతం)

"అలనాడు బృందావనంలో శ్రీకృష్ణ పరమాత్మ వేణునాదం గోపికల హృదయాలలో అమృత రసాన్ని చిలికి, ఆనందాన్నిచ్చింది. నాదం ద్వారా ఆనందాన్ని పొంది, విషయములు, సుఖ దుఃఖములు, రాగద్వేషములు మరచిపోయి, తుదకు ఆ నాద రూపాన్నే వారు పొందారు.అట్టి నాదం ద్వారా యింద్రియాలు, మనస్సు శాంతిని పొందాయి. గోపికల హృదయాన్ని రంజింప జేసిన గొప్పతనం ఎవరిది? శ్రీకృష్ణ పరమాత్మదా? ఏడు రంధ్రములున్న వేణువుదా? అట్టి సంఘటనలు యీనాడూ వున్నాయి."

సత్సంగం ప్రారంభమైన మరుక్షణంలోనే వర్షం కూడా ప్రారంభమైంది. బాబూజీ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "నేను ఆశ్రమంలో బయలుదేరే సమయానికి వర్షం చాలా ఎక్కువగా ఉంది. వర్షం వస్తుంది. వరుణుడు మంచి సదవకాశం యిచ్చాడు. మీరంతా యిలా చుట్టూ కూర్చుని, నేనిలా మీ మధ్యన కూర్చుంటే ఎలా వుందంటే, స్వయంభూ ప్రకాశ స్వరూపుడైన పరమాత్మ జ్ఞాన క్షీరాలనిస్తున్నాడా! అన్నట్లు వుంది" అన్నారు శ్రీబాబు.

భక్తులంతా తన్మయులై ఆ జ్ఞాన క్షీరాలను ఆస్వాదించారు. వారికి దేహ భావన, యింద్రియ భావన లేదు. వర్షం కురుస్తూనే ఉంది. భక్తులంతా తడిసిపోయారు. వర్షం పడుతోందన్న భావన ఎవరికీ లేదు. భక్తులందరి హృదయాలనూ రంజింప జేసే ప్రణవ నాదమే శ్రీబాబూజీ బోధామృతం.

మనస్సు సంకల్పాలతో కూడి ఉంటుంది. గోమయంలోని కీటకం వలెనే నీలో ఉన్న సంకల్పములు, జన్మాంతర వాసనలు, అహంకార మమకారాలు అన్నీ కలిసి వ్రణముగా ( పుండు) తయారై తుదకు జనన మరణమనే వ్యాధి రూపాన్ని పొందుతుంది. శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు పిబరే రామరసం అన్నారు.

గీతలో పరమాత్ముడు యిచ్చిన సందేశం ఒక్కటే ' పరిమితమైన ఉపాధి కలిగిన జీవితాన్ని శాస్త్ర పఠనతో వృథా పరుస్తారు మానవులు. ప్రజ్ఞావంతులైన దివ్య జ్ఞానం యిచ్చే దాన్ని మరచిపోతున్నారు. అదే పిబరే రామ రసం.

రామా! కృష్ణా! వాసుదేవా! అనుకుంటూ అక్షర ధ్యానం చేసి, రామపాదుకలపై నీ మనస్సునుంచినట్లయితే, నీలో కరెంట్ ప్రవేశించి, దుర్గుణములన్నీ సుగుణములుగా మారి నిన్ను పవిత్ర మానవునిగా మార్చివేస్తుంది. గోపికలు సర్వకాల సర్వావస్థలయందు

కృష్ణుని యందే మనస్సు నిలిపారు. పాలు పితుకుతున్నా, వర్షం వస్తున్నా కృష్ణుణ్ణే దర్శించారు. వారి త్యాగమే త్యాగము. వారు కన్నుమూయుటే మరచారు. కాబట్టే తమోగుణం ఎగిరి పోయింది. దేహాభిమానం, రాగద్వేషాలనే వస్త్రాలు కృష్ణపరమాత్మకు సమర్పించారు. కృష్ణుడు వారికి భక్తి వస్త్రాన్ని అందజేశారు. ఆ వస్త్రం ధరించినవారికి భవబంధములు ఉండవు. సర్వత్రా అభేద దృష్టి.

ఈరోజు వర్షం కురిసినా కార్యక్రమం బాగానే జరిగింది. ఒక్క మానవుని చెక్కిళ్ళపై నీరు తుడిచి, అభయమిచ్చినట్లయితే నా జన్మ సార్థకం! మీ హృదయం ఎప్పుడూ బ్రహ్మానందంలో ఓలలాడి పూర్ణ సుఖశాంతులతో ప్రకాశిస్తుందో, అప్పుడే నా జన్మ సార్థకం! అట్టి మీ ఆనందాన్ని చూసి సంతోషిస్తాడు మీ హృదయబాబు!

బాబూజీ ఉపన్యాసం ముగించే సమయానికి భక్తులంతా వర్షంలో తడిసిపోయారు. వారికి తడిసిపోయామనే స్మృతి కూడా లేదు. "మీరంతా వర్షంలో తడిసిపోయామని బాధ పడకండి. ఇది వృథా పోదు. అది ఏవిధంగా పని చేస్తుందో మీకే తెలుస్తుంది" అని తమ బోధామృతాన్ని ముగించారు.

*

- చందమామతో వెన్నెల, మేఘమాలతో మెరుపు, పతి తోడు పతివ్రతా వెళ్లిపోతుంది.

- వేముకు పానకం పోసినట్లు, పాముకు పాలు పోసినట్లు, కడలిలో చక్కర కలిపినట్లు, బూడిదలో పన్నీరు పోసినట్లు, చేసిన మంచి వ్యర్థం. చేసిన మంచి కొంతకాలానికి చెడ్డగా తోస్తుంది. చలికాలంలో హాయిగా ఉండే సూర్యుడు వేసవికాలంలో బాధాకరుడు కాదా?

- అసాధువులకు జన్మభూతితో పనిలేదు. చల్లని నీడనిచ్చే కొమ్మలలో పుట్టే నిప్పు, ఆ కొమ్మనే కాల్చేయదూ? వర్షాన్నిచ్చే మేఘాల నుండి పిడుగులూ, మన్నులో మణులు వలెనే మంచివాళ్లకు దుష్టులూ పుడతారు.

- అగ్ని తేజం మంట గలిసింది, వరుణ శక్తి నీట గలిసింది, వాయు బలం గాలికి కొట్టుకు పోయింది.

- తెగిన హారంలో ముత్యాల్లాగా, ఓడిన శత్రువులు నాలుగు దిక్కులా పరుగెత్తారు.

– వెంకట రమణ ప్రసాద్

# హృదయాంతరవాసి భగవాన్

- స్వామి రామదాస

తన యిష్టదైవమైన శ్రీకృష్ణుని దర్శనం కోసం తపించే భక్తుడొకడు, తనకాదారి చూపమని ఎందరో తెలిసిన కృష్ణభక్తుల్ని సాయం చేయమని ప్రార్థించాడు. "మా కింత వరకూ ఆయన దర్శనం కాలేదు. అటువంటిది నీకు ఆయన్ని ఎలా చూపగలం?" అన్నారు. బృందావనంలో ఉన్న వారెవరైనా నీకా మార్గం చూపగలరేమో అక్కడకు వెళ్ళు" అని సలహా యిచ్చారు.

ఆ భక్తుడు తిన్నగా బృందావనం వెళ్ళి అక్కడున్న దేవాలయాలలోని పూజారులను, భక్తులను శ్రీకృష్ణదర్శన మార్గం తెలుపమని వేడుకొన్నాడు. ఎవరిని అడిగినా ముక్త కంఠంతో "మేమింతవరకూ కృష్ణుని దర్శించలేదు. అందుచేత నీకీ విషయంలో సాయం చేయలేము" అని చెప్పారు. గోకులం వెళ్ళితే యేదైనా మార్గం దొరకవచ్చునని చెప్పారు.

అతను గోకులం, మధుర, ద్వారక, గోవర్ధనధామం వెళ్ళడమేగాక దేశం నలుమూలల ఉన్న కృష్ణదేవాలయాల్ని దర్శించి, అక్కడి భక్తులన్ని ఆశ్రయించినా ఫలితం శూన్యమైంది.

చేసేదేమి లేక ఆ భక్తుడు దుఃఖిస్తూ, శోకతప్త హృదయంతో ఒక బండరాతి మీద కూర్చుని "హే ప్రభూ! నీ కోసం వెదికి వేసారిపోయాను. నిన్ను యింకెక్కడని వెదకను? నీ దర్శన భాగ్యం కలుగజేయి. హే! దీననాధా! నేను నిజమైన భక్తుడినైతే నీ దివ్య సుందర విగ్రహ దర్శనమియ్యి." అని విలపింప సాగాడు.

చిత్రం అతని హృదయం నుండి మధురనాదం వినిపించింది. "కుమారా! నేను నీ హృదయాంతరంగుడినై ఉన్నాను. అంతర్ముఖుడువై నా దివ్య తేజోమయ మూర్తిని దర్శించి శాశ్వతానందాన్నీ, శాంతినీ అనుభవించు".

*

# ధర్మ రహస్యం

పి. సీతారామయ్య

పూర్వకాలం ఒక మహాముని దగ్గర సత్యకాముడు, అంగిరసుడు అనే శిష్యులు విద్యను అభ్యసించేవారు. గురువుగారు వారికి సమస్త విద్యలూ నేర్పించి, చివరకు ఒకనాడు శిష్యులిద్దరినీ పిలిచి "చూడండీ! పుస్తకాలలో చదివిన విద్యలకన్న అనుభవంలోనే విద్య బాగా నేర్చుకోవాలి. అదే నిజమైన చదువు. మీకు జీవతమే గుణపాఠం నేర్పుతుంది. ఎటువంటి పరిస్థితులలోనూ 'అహింస పరమ ధర్మం' అనే సత్యాన్ని మరచిపోకండి" అని చెప్పి దేహ త్యాగం చేశాడు.

గురువుగారు పోగానే సత్యకాముడూ, అంగిరసుడూ దగ్గర దగ్గరగా రెండు పర్ణశాలలు వేసుకొని విడివిడిగా తపస్సు ప్రారంభించారు. అలా ఉండగా వారికి ఒకనాడు అడవిలో ఎవో హాహాకారాలు వినిపించాయి. అంగిరసుడు తపస్సు నుండి లేచి వెళ్ళి చూసేసరికి ఒక దొంగలగుంపు ఆ దారిని ఎడ్లబండ్లలో పోతున్న పెళ్ళివారిని దోచుకుంటున్నది.

అంగిరసుడు ఒక్క క్షణం ఏం చేయాలా? అని ఆలోచించాడు. "దొంగలు చేస్తున్నది అన్యాయం. నిజమే! కాని దానిని ఎదుర్కోవడం కోసం దొంగలపై చేయి చేసుకుంటే అది మాత్రం హింస కాదా? అహింస పరమ ధర్మమైనప్పుడు దొంగలను హింసించడం కూడా తప్పే కదా!" అని అంగిరసుడు భావించి, వారికి ధర్మోపదేశం చేసి, మనస్సు మార్చాలాని నిశ్చయించుకున్నాడు. వెంటనే అతను ఆ దోపిడీ జరిగే జరిగే ప్రదేశానికి వెళ్ళి 'నాయనలారా! అహింస పరమ ధర్మం. మీరు అమాయకులైన బాటసారులను దోచుకోవద్దు. కావాలంటే నా ఆశ్రమానికి రండి మీకు తినటానికి మంచి కందమూలాలను యిస్తాను" అని హితబోధ చేయబోయాడు.

ఇది చూసి ఆ దొంగలలో ఒకడు "వీడెవడు కాకిలా అరుస్తున్నాడు?" అని చేతిలో ఉన్న ఒక దుడ్డు కఱ్ఱతో అంగిరసుణ్ణి ఒక్క దెబ్బతో నేలకరిపించాడు.

ఈలోగ సత్యకాముడు కూడా ఆ కలకలం విని, ఆశ్రమం నుండి అక్కడకు వచ్చాడు. వస్తూనే జరుగుతున్నదేమిటో క్షణంలో గమనించాడు. వెంటనే చేతికందిన కఱ్ఱతో దొంగలపై తిరగబడ్డాడు. తమకు సహాయంగా ఉండటానికి ఎవరో వచ్చారని తెలిసి, బాటసారులకు కూడా ధైర్యం వచ్చింది. వారూ పిరికితనం వదిలి తిరగబడ్డారు. బాటసారులు కూడా ఎక్కువ సంఖ్యలోనే ఉన్నారు. అందుచేత దొంగల గుంపును వారు కొంతసేపట్లో చిత్తుగా ఓడించారు. సత్యకాముడు కొట్టిన దెబ్బకు దొంగల నాయకుడి తల పగిలింది. దానితో దొంగలు పరుగు పుచ్చుకున్నారు.

బాటసారులంతా సత్యకాముడిని పొగిడి, దొంగల బారి నుండి తమను రక్షించినందుకుగానూ బంగారమూ, ధనమూ కానుకలుగా యిచ్చి, తమ దారిని తాము వెళ్ళిపోయారు. ఈ లోపల అంగిరసుడు మెల్లగా లేచి కూర్చున్నాడు. సత్యకాముడు అతని తలకు కట్టుకట్టాడు.

అంగిరసుడు సత్యకామునితో "చూడూ సత్యా! గురువు ఆజ్ఞను ధిక్కరించావు. ఎటువంటి పరిస్థితులలోనూ అహింసను పరమ ధర్మంగానే భావించమని గురువుగారు చేసిన చివరి ఉపదేశాన్ని నీవు తిరస్కరించావు. బాటసారుల కోసమై దొంగల రక్తం చిందించావు. ఈ విధంగా నీవు గురుద్రోహం చేసావు" అన్నాడు.

సత్యకాముడు నవ్వి "అంగిరసా! నేను చేసింది ధర్మమేనని నాకు అనిపించింది. దాని మీద చర్చ అనవసరం" అన్నాడు. "బాగుంది నీ వాదం. హింసచేసి, బంగారమూ, ధనమూ సంపాదించుకొని, యింకా ధర్మమే చేశానంటావా?" అని అంగిరసుడు కోపగించుకున్నాడు."ఈ ధనం మన దేశపు రాజుగారికి యిస్తాను. వారు దాన్ని ప్రజలకోసం వినియోగిస్తారు" అన్నాడు సత్యకాముడు.

"అయితే పద. మన రాజుగారు నీలకేతువు మహాదాత అనీ, ధర్మసూక్ష్మాలు తెలిసినవాడనీ లోకులంతా అనుకుంటారు. ఆయననే అడుగుదాం. మనం చేసిన వాటిల్లో ఎవరిది తప్పో?" అని అంగిరసుడు సత్యకామునితో సహా రాజధానికి బయలుదేరాడు.

అలా మునులిద్దరూ రాజధాని చేరేసరికి, నీలకేతు మహారాజు అనాధలకు రెండు చేతులా దానాలు చేస్తున్నాడు. "ధర్మ ప్రభూ ! పదికాలాలపాటు బ్రతుకు" అని ప్రజలంతా దీవిస్తున్నారు. ఆ మునులిద్దరూ ప్రభువు దగ్గరకుపోయి నమస్కరించారు. ప్రభువు అర్ఘ్యపాద్యాదులు తెప్పించి వారిద్దరినీ ఘనంగా పూజించాడు. మహారాజు తల మీద ఒక దెబ్బతగిలి ఉండటాన్ని తన పాదపూజ జరిగేటప్పుడు సత్యకాముడు గమనించి, పరీక్షగా రాజును చూశాడు. వెంటనే నివ్వెరపోయాడు. నిన్నటి దొంగల నాయకుడు నీలకేతువేనని సత్యకాముడు పోల్చుకున్నాడు. ఆ దెబ్బ కూడా తాను కొట్టిందేనని గమనించాడు.

"అంగిరసా! ఇక పోదాం పద. ఆ రాజే న్నినటి దొంగల నాయకుడు. ఇల్లాంటి కిరాతకుడి వద్ద యింకా ధర్మ సందేహం తీర్చుకోవటమేమిటి?" అని సత్యకాముడు అంగిరసునితో రహస్యంగా అన్నాడు.

అంగిరసుడు మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. కొంచెం ఆగి, "సత్యకామా! రాజు చేసిన యీ పనిలో కూడా నాకు అహింసయే కనబడింది. ధనికులైన బాటసారులను దోచుకుని, దానిని పేదలైన ప్రజలకు మహారాజు పంచిపెట్టడంలో తప్పేమిటో చెప్పు" అని ప్రశ్నించాడు.

సత్యకాముడు నవ్వి, "రాజు మనం అనుకున్నంత అమాయకుడు కాడు. ఆయనకు కావలసింది కీర్తి. అందుకని మారువేషంలో ప్రజలను దోచుకుని, రాజుగా దానినంతా మళ్ళీ దానాలు చేసి కీర్తి సంపాదించుకుంటున్నాడు. నిజంగా అంత దాత అయితే తన పట్టమహిషిల శరీరాలపై ఉన్న రత్నాల హారాలు, తన అంతఃపురంలో వున్న బంగారమూ ఎందుకని దానం చేయకూడదు? శత్రురాజుల నుంచి ధనం తెచ్చి ఎందుకు పంచకూడదు?" అని ప్రశ్నించాడు.

అంగిరసుడు మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. "శత్రురాజులు కూడా మనుష్యులే కదా! వారి నుండి ధనం తెస్తే అది మాత్రం హింస కాదా? వారిని హింసించి తెచ్చిన ధనం దానానికి ఎలా పనికి వస్తుంది?" అన్నాడు.

"శత్రురాజుల నుంచి తెచ్చిన ధనం దానానికి పనికిరాకపోతే, బాటసారుల నుండి తెచ్చిన ధనం దానానికి అసలే పనికిరాదు" అంటూ సత్యకాముడు అంగిరసునితో యింక వాదించకుండా తిరుగుముఖం పట్టాడు. అంగిరసుడు కూడా ఆశ్రమానికి బయలుదేరాడు.

ఈలోగా తానే దొంగలనాయకుడిననే రహస్యం వారికి తెలిసిపోయిందని నీలకేతువు మహారాజు భయపడ్డాడు. వెంటనే భటులను పంపించి తిరిగి అరణ్యానికి పోతున్న ఆ మునులను దారిలోనే హత్య చేయించాడు.

మరణానంతరం యమదూతలు వచ్చి సత్యకాముణ్ణి యమలోకం తీసుకువెళ్ళారు. అంగిరసుణ్ణి స్వర్గం తీసుకుపోయారు.

స్వర్గం పోయిన అంగిరసుడు దేవేంద్రుణ్ణి చూసి "సత్యకాముడనే ఒక పాపాత్ముడు నరకం పోయాడు. అతడు నా మిత్రుడు. తాను చేసినది హింసయేనని అతడు యిప్పటికైనా ఒప్పుకుంటాడో లేదో కనుక్కురమ్మనమని కబురుపెట్టండి" అన్నాడు.

దానికి ఇంద్రుడు నవ్వి "అంగిరసా! నీవు మహాపాపివి. ఎవరు ఏది తక్కువ చేస్తే అది ముందు అనుభవిస్తారు. అందుకని నీవు యీ ఒక్కరోజూ స్వర్గంలో ఉండి, శాశ్వతంగా నరకానికి పోతావు. సత్యకాముడు యీ ఒక్కరోజూ నరకంలో ఉండి రేపటి నుంచి శాశ్వతంగా యీ స్వర్గానికి శాశ్వతంగా వచ్చేస్తాడు.

ధర్మాన్ని గురించి త్వరగా నిర్ణయం తీసుకోవడం చేతకాలేదు. ప్రతిదానికీ అలా మన్నుతిన్న పాములాగ ఆలోచనలో పడి, కర్తవ్యాన్ని మరచిపోయావు.

అహింసను రక్షించేందుకు ఒకవేళ హింస చేసినా కూడా, ఆ హింస అహింస అనే పిలవబడుతుంది" అని అసలు ధర్మరహస్యాన్ని అంగిరసునికి బోధించాడు!!

*

# నేను అర్థం చేసుకున్న శ్రద్ధాత్రయ విభాగ యోగం

- కొండ వెంకట్రాజు

ఇంతకు ముందు గుణత్రయ విభాగయోగం 14వ, అధ్యాయంలో త్రిగుణాల గురించి భగవానుడు వివరించినది తెలుసుకున్నాము. ఇంకనూ యీ సత్వ రజో, తమో గుణాలని పలు విధాలుగా విభజించి, విపులంగా 17, 18వ అధ్యాయాలలో వివరించడం జరిగింది. 17వ అధ్యాయం శ్రద్ధాత్రయ విభాగయోగంలో భగవంతుడు చెప్పింది యిప్పుడు తెలుసుకుందాం.

జీవుడు పూర్వజన్మ సంస్కారం వలన శ్రద్ధ అలవరచుకొంటున్నాడు. సాత్విక శ్రద్ధ, రాజస శ్రద్ధ, తామస శ్రద్ధ, అసలు శ్రద్ధయే లేకపోవటమనేవి ప్రాణి యొక్క జన్మాంతర పుణ్య ఫలము వలన కలుగుతున్నాయి. ఈ శ్రద్ధయే ప్రతి పనికీ అంకురము. శ్రద్ధ లేనిదే ఏ పనీ అవ్వదు. ఆధ్యాత్మిక ప్రయాణంలో ఈ శ్రద్ధ యింకా ఎక్కువ ప్రాముఖ్యం అవుతోంది.

భగవంతుడు 1. ఆహారము, 2. యజ్ఞము, 3. తపస్సు, 4. దానము అను నాలుగు గుణాలుగా విభజించి విశదీకరించారు. ఇక్కడ ఈ నాలుగు పనులకు తామస గుణాల నుండి సత్వగుణ సంపున్నులుగా మారాలంటే మనం పెట్టవలసిన శ్రద్ధ ఏ మోతాదులో ఉండాలో తెలుసుకోవాలి.

*ఆహారము దాని యొక్క త్రిగుణ శ్రద్ధలు -*

మనం భుజించే ఆహారం రసమై, రక్తమై, మాంసమై మేధస్సు మొ॥గు ధాతువులుగా పరిణామం చెంది మన శరీరానికి పుష్టిని యిస్తోంది. ఆహారం యొక్క సూక్ష్మాంశం మన మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాలకు పోషణగా మారుతుంది. ఆత్మ నియమమునకు సాత్వికాహారము, మితాహారము అత్యవసరము. ఆధ్యాత్మిక సాధనకు ముందుగా ఆహార శ్రద్ధ అత్యావసరము. ఆధ్యాత్మిక సాధన ముందుగా ఆహార శ్రద్ధ నుండి సాధన మొదలు పెట్టాలి.

*సాత్వికాహారము -*

తగుమాత్రంగా ఉప్పు, కారం, పులుపు, నూనె, మసాలాలు నెమ్మదిగా అరుగుదల గల పదార్థాలు (తొందరగా జీర్ణం కాకుండా ఉండే పదార్థాలు) మనం చేసే పరిశ్రమకి సరిపడా ఉండే భోజనం, పిండి పదార్థాలుపోషకాలు, క్రొవ్వు పదార్థాలు తగుమాత్రమే ఉండే భోజనం, ఎక్కువ దాహం కలగకుండా ఉండే పదార్థాలు అయిన ఆహారం సాత్వికాహారం అని చెప్పబడుతోంది.

కొంత వయస్సు వచ్చాక మనం ఆధ్యాత్మిక సాధన పెంచుకుంటాం కాబట్టి ఆహార శ్రద్ధ కూడా పెంచుకోవాలి. అధిక తీపి, ఉప్పు, నూనె పదార్థాలు వాడకుండా వుండటంలో మిక్కిలి శ్రద్ధ వహించాలి. న్యాయమైన సంపాదన నుండి సమకూరిన

ఆహారం శుద్ధంగా ఉండి అంతఃకరణ శుద్ధి కలగటానికి మూలం అవుతుంది. మరియు ఉత్తమ వంశోద్ధారకులకు ఆస్కారం ఉంటుంది అని పెద్దలు చెప్పుతున్నారు.

*2. రాజస ఆహారం –*

అధిక కారం, పులుపు, ఉప్పు, మసాలాలు అన్నీ అధిక మోతాదులో తిండి రాజసాహారాం క్రింద వస్తాయి. పిన్న వయస్సులో ఫరవాలేదుకాని, వయస్సు పెరుగుతున్న కొద్దీ ఈ రజో ఆహారాన్ని మార్చుకోవాలి. జిహ్వ రుచులను నియంత్రించాలి.

*3. తామస ఆహారం –*

ఒక రోజు నిల్వ ఉన్న ఆహారం, వాసన వచ్చినది, మాంసాహారాము, అతి మసాలాలు, అతి నూనె పదార్థాలు, అతి తీపిగలవి యివన్నీ తామసాహారము క్రింద పరిగణించాలి. ఈ అతి అలవాట్లను వదులుకోవాలి.

ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మానవ జన్మ వచ్చింది. కాబట్టి అట్టి యంత్రాన్ని మనం ఎక్కువకాలం బ్రతికించి మానవ సేవ, మాధవ సేవ చేసుకోవలసి ఉంటుంది. అందువలన మన ఆహార వ్యవహారములలోను, ఆరోగ్య విషయాలలోను గట్టి శ్రద్ధ అలవరచుకోవాలి.  ఈ శ్రద్ధ మీద శ్రద్ధ కలిగి ఉండాలి. మనం బ్రతికినంత కాలం ఆ శ్రద్ధ అలాగే ఉండాలి. గురువులు ఎంత ప్రబోధించినా ఈ విషయం మనకు తలకు ఎక్కదు. అదే ఏ సుగరు వ్యాధో వస్తే, చచ్చినట్లు శ్రద్ధ దానంతటదే వస్తుంది.

– సశేషం

# భేద దృష్టి

భగవంతుడు అన్యంగా ఉన్నాడనే దృష్టి భయాన్నీ, బరువునూ కలిగిస్తుంది.

ఒక బాటసారి చద్దిమూట భుజానవేసుకుని నడుస్తున్నాడు. బాగా అలసిపోయాడు. మూట బరువుగా అనిపించింది. ఎక్కడైనా పెట్టి విశ్రమిద్దామంటే చీమలు పడతాయో, కోతులు ఎత్తుకుపోతాయో, కుక్కలు యీడ్చుకుపోతాయోననీ భయం!

ఒక కోనేటి ఒడ్డున కూర్చుని తిని మంచినీళ్ళు త్రాగాడు. తత్ పదమూ, త్వం పదమూ ఏకమైంది. ఆ మూట అన్యంగా ఉన్నంత వరకూ బరువూ,భయమూ. తిన్నాక హాయీ, బలమూ, నిర్భయమూ. దీనినే సురేశ్వరాచార్యులవారు '***రక్షణాత్ ఖేదకృత్, భక్షణాత్ మోదకృత్***' అన్నారు.

– వెంకట రమణ ప్రసాద్

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి - విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

మన్మనా భవ। మద్భక్తో। మద్యాజీ। మాం నమస్కురు।
మామేవైష్యసి యుక్త్వైవం। ఆత్మానం మత్పరాయణః॥

(భ.గీ 9-34)

"అర్జునా! నా యందే మనస్సు నిలుపుకొని, నా భక్తుడవై, నన్నే నమ్ముకొని సేవించుకుంటూ నీ దృష్టిని నా యందే నిలుపు. తప్పక నన్నే పొందగలవు."

తన పరమానుగ్రహాన్ని పొందటానికి ఏం చేయాలో స్పష్టంగా శ్రీకృష్ణభగవానుడు, అర్జునునికి చెప్పిన మాటల ద్వారా, తన భక్తులందరికీ అందించిన సులభోపాయమిది.



అక్షరాల అలాగే ఆచరించుకొని శ్రీగురు పరిపూర్ణానుగ్రహానికి పాత్రులై శ్రీగురులయం పొందిన జీవన్ముక్తులు శ్రీ చిరంజీవిరాజుగారు.

శ్రీమావులేటి చిరంజీవిరాజుగారు గుండుగొలనులో ఒక సుసంపన్నమైన, సుక్షత్రియ కుంటుంబానికి చెందినవారు. వారి తల్లి శ్రీమతి శేషమాంబగారు ఆత్మజ్ఞాన సంపన్నులు, ఉన్నతమైన గురు సంప్రదాయానికి చెందినవారై, గురుదీక్షలో పరిపూర్ణులైనారు. చిరంజీవిరాజుగారి ధర్మపత్ని శ్రీమతి రాఘవమ్మగారు మహాపతివ్రత. చిరంజీవిరాజుగారు మొదటి నుండి బాగా విలాస జీవితం గడపటానికి అలవాటు పడినవారు.

శ్రీబాబు గుండుగొలను రావటం మొదలుపెట్టిన కొత్తల్లో రాఘవమ్మగారి సోదరులైన గోపాలరాజుగారింటికి వస్తూ ఉండేవారు. రాఘవమ్మగారు ప్రథమ గర్భం ధరించి ఉండగా, 1948లో ఆమెను గోపాలరాజుగారు శ్రీబాబు దర్శనం చేయించటం కోసం తమ యింటికి తీసుకుని వచ్చారు. అప్పుడే రాఘవమ్మగారికి ప్రథమంగా శ్రీబాబు దర్శన భాగ్యం లభించింది.

ఉయ్యాలబల్లపై ఊగుతూ కూర్చుని ఉన్న శ్రీబాబును దర్శించినప్పుడే ఆమెకు భగవద్దర్శనమైనంత ఆనందం కలిగింది. ఆమె శ్రీబాబు కోసం ఉపాహారం తీసుకు వచ్చారు. శ్రీబాబు వద్దని, పాలు మాత్రం తీసుకున్నారు. ఆమె వద్దన్నా వినకుండా శ్రీబాబు తామే వెళ్ళి, ఆ పాల గ్లాసును కడిగి తీసుకుని వచ్చారు. శ్రీబాబు

నిరాడంబరతను, ఔన్నత్యాన్ని ఆనాడే కొంత అర్థం చేసుకోగలిగానని రాఘవమ్మగారు చెప్పారు.

ఆ రోజున చిరంజీవిరాజుగారు ఊళ్ళో లేరు. శ్రీబాబు దర్శనం కోసం రాఘవమ్మగారు మరొకసారి వచ్చే సమయంలో, చిరంజీవిరాజుగారు యింట్లోనే వున్నారు. కాని "నేను యిప్పుడు రానులే. నువ్వు వెళ్ళిరా" అన్నారు. తరువాత చిరంజీవిరాజుగారు వారంతట వారే శ్రీబాబు దర్శనానికి వెళ్ళటం జరిగింది. అది ఎన్ని జన్మల అనుబంధమోగాని, ప్రథమ దర్శనంలోనే రాజుగారి మనస్సు శ్రీబాబు శ్రీ చరణాలకు అర్పితమై పోయింది. అదే వారి జీవితంలోని మేలు మలుపు.

శ్రీబాబు గోపాలరాజుగారింట్లో ఉండే రోజుల్లో, తమ పూజ ముగించుకున్న తరువాత రుక్మిణమ్మగారింటికి భోజనానికి వెళ్ళేవారు. రుక్మిణమ్మగారు వైశ్యులు. అందువలన కొందరు శ్రీబాబును 'కోమటి సాధువు' గారనేవారు. ఆ తరువాత శ్రీబాబు నివేదన కోసం గుండుగొలను నివాసులైన బ్రాహ్మణ సోదరులు శ్రీ కోడూరి విశ్వనాధం, కృష్ణమూర్తిగార్ల యింటి నుండి కారియర్‌తో వచ్చేది. కాంతమ్మగారు (భీమవరం దత్తుమాస్టారుగారి అత్తగారు) కారియర్ తీసుకుని వచ్చేవారు. ఆ తరువాత శ్రీబాబు కొన్నాళ్ళు శ్రీ కాంతమ్మగారి యింట్లోనే భోజనం చేసేవారు. ఎక్కడ బోజనం చేసినా శ్రీబాబు తమ విస్తరిని తామే తీసి శుద్ధి పెట్టేవారు.

శ్రీబాబు దర్శనం కోసమని భీమవరం నుంచి శ్రీ చల్లాకృష్ణమూర్తిగారు అప్పుడప్పుడు గోపాలరాజుగారింటికి వస్తూ ఉండేవారు. ఒక రోజున అలా వచ్చినప్పుడు శ్రీబాబు కాంతమ్మగారింట్లో నివేదన చేసుకుంటున్నట్లు తెలిసింది. కృష్ణమూర్తిగారు కాంతమ్మగారింటికి వెళ్ళి వాకిట్లో అరుగు మీద కూర్చున్నారు.

శ్రీబాబు తమ భోజనం ముగించి, తమ విస్తరిని బయటపారవేసి లోపలికి వెళ్ళిపోయారు. అప్పుడు కృష్ణమూర్తిగారు ఆ విస్తరి పడిన చోటుకి వెళ్ళి దానిలో మిగిలిన పదార్థమును తీసుకుని, కళ్ళకద్దుకుని తినటం మొదలు పెట్టారు.

కాంతమ్మగారి మరదలు సత్యవతమ్మగారు (రామ్మూర్తిమాస్టారు భార్య) యిది గమనించిఎంతో ఆశ్చర్యంతో కాంతమ్మ గారికి యీ విషయం చెప్పారు. వారిరువురూ కృష్ణమూర్తిగారి ద్వారా శ్రీగురుభుక్తశేషమైన సుప్రసాదం ఎంత మహిమాన్వితమైనదో గ్రహించారు. శ్రీబాబుతో వారి విస్తరిని వారితోనే తీయిస్తున్న తమ అల్పజ్ఞత్వానికి సిగ్గుపడి లెంపలు వేసుకొని, కొంచెం ప్రసాదమును తాము కూడా కళ్ళకు అద్దుకుని తీసుకున్నారు. శ్రీబాబు ఎంతటి మహనీయులో అప్పుడు కొంతవరకు అర్థం చేసుకున్నారు.

-సశేషం

# రావణుని పూర్వ జన్మ వృత్తాంతము

గత సంచిక తరువాయి - శ్రీ జ్ఞానానంద స్వామి

కర్మవశాత్తు ప్రతాపభానుడు ఆ దుష్టబుద్ధిని గుర్తించలేకపోయాడు. కానీ కపట వేషధారియైన ఆ రాజు ప్రతాపభానుని గుర్తించాడు. అంతేకాక తన పగ తీర్చుకోవటానికి తగిన సమయం ఆసన్నమైందన్న ఆనందంతో తనను తాను మరిచాడు. కాని తనలోని భావాలను బయటపడనీయక ఆ కపటముని, ప్రతాపభానుని సాదరంగా తన కుటీరంలోకి ఆహ్వానించాడు. ప్రతాపభానుడు తను అరణ్యంలో ఒంటరిగా చిక్కుపడిపోయిన సంగతి తెలిపి, తాను, తన అశ్వం ఆకలి దప్పికలతో అలమటించి పోతున్నామని తమకు సహాయం చేయమని ఆ కపటమునిని అర్థించాడు. కపటముని సంతోషంతో రాజుకు ఆతిథ్యాన్నిచ్చి, ఆ రోజుకు తనవద్దననే ఉండిపొమ్మని కోరాడు. ప్రతాపభానుడు అతని మాటలను త్రోసిపుచ్చలేక, ఆ రోజుకు అక్కడే ఉందామన్న నిర్ణయానికి వచ్చాడు. కారణం నిశీథ సమయంలో తాను తన రాజ్యం చేరుకోవటమనేది దుర్లభం.

రాజు సేదదీరిన అనంతరం, ఆ కపటముని ఎంతో ప్రేమగా రాజును చూసి, "తేజస్వరూపుడవైన ఓ రాజ కుమారా ! నీ శుభ నామాన్ని తెలుసుకోవచ్చునా? నిన్ను కని ధన్యులైన నీ మాతా- పితురులు ఎవరు? ఈ విధంగా ప్రశ్నించానని నీవు అన్యథా భావించకు. నా ప్రశ్నల వలన నీకు ఎన్నడు కీడు కలగదు. తాపసులమైన మేము రాజుయొక్క సౌఖ్యాన్ని అపేక్షిస్తామే కానీ అతనికి కలలో కూడ కీడు తలపెట్టం."

కపటముని మాటలకు జవాబుగా ప్రతాపభానుడు, "ఓ మునీశ్వరా! కేకయదేశాన్ని ప్రతాపభానుడు అనే రాజు పరిపాలిస్తున్నాడు. నేను అతనికి ప్రధాన మంత్రిని. వేట నిమిత్తమై వచ్చి నా అదృష్టవశాత్తు మీ వంటి మహాత్ముల దర్శనాన్ని చేసుకోగలిగాను. మహాత్మా! నన్ను తమ పుత్ర సమానుడిగా ఎంచి తమ శుభ నామాన్ని, తమరు ఎందుకిలా ఈ కారడవిలో ఒంటరిగా జీవిస్తున్నారో తెలియచేస్తే సంతోషిస్తాను".

ప్రతాపభానునికి తనపట్ల విశ్వాసం కలిగిందని గ్రహించిన కపటముని అతనితో యిలా అన్నాడు "సజ్జనుడా! నేను యిక్కడ చాలా కాలంగా నివశిస్తున్నాను. ఇప్పటివరకు ఎవరూ నన్ను కలవలేదు. నేనూ ఎవరిని పలుకరించి ఎరగను. నిత్యము హరిధ్యానంలో ఉండే నాకు సాధారణ మానవులతోటి అనవసరమైన ప్రసంగాలు చేసే సమయంగానీ, ఉత్సాహం గానీ లేవు. నా యీ మాటలు నీకు ఆశ్చర్యాన్ని కలిగింప వచ్చు. అంతేకాదు ఎవరినీ పలకరించని ఈ మునీశ్వరుడు నన్ను ఎలా పలుకరించాడా అన్న ప్రశ్న నీలో ఉదయించవచ్చు. దానికి గల కారణం నీలో నాకు పవిత్రత గోచరించింది. నిన్ను చూడగానే నీ పట్ల నాకు వాత్సల్యభావం కలిగింది. అందుచేతనే

నీతో యీ విధంగా మాట్లాడుతున్నాను. ఇక నా గురించి చెబుతాను విను. నా పేరు ఏకతముడు".

మునీశ్వరుని పేరు వినగానే ప్రతాపభానుడికి చాలా అశ్చర్యం కలిగింది. తన ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తూ ఆ పేరులో గల అర్థాన్ని వివరించమని ప్రతాపభానుడు మునిని కోరాడు. కపటముని ప్రతాపభానుని ప్రశ్నకు సమాధానం యిస్తూ "కుమారా! ఈ పృథ్వి పుట్టినప్పుడే నేను పుట్టాను. ఆ తరువాత మరలా నేను వేరొక జన్మ ఎత్తలేదు. కాబట్టి నా పేరు ఏకతనుడు. వినయ సంపన్నుడా! తపస్సుతో సాధింపలేనిదంటూ ఏదీ లేదు.

మహాతపసంపన్నుడు కాబట్టే కదా బ్రహ్మ చరాచర సృష్టిని చేయగలుగు తున్నాడు. తపోశక్తి వలననే కదా విష్ణువు ముల్లోకాలను పాలించ గలుగుతున్నాడు. రుద్రుడు రాక్షసులను తపోశక్తి వలననే కదా సంహరింప గలుగుతున్నాడు. తపస్సుతో సాధింపలేనిదంటూ యీ లోకంలో ఏదీ లేదు".

ఈ విధంగా కపటముని పురాణ యితిహాసాలను వివరిస్తూ ప్రతాపభానుని పూర్తిగా తన వశం చేసుకొని, తన పట్ల అతనికి విశ్వాసం కలిగేలా ప్రవర్తించి అతనితో యిలా అన్నాడు, "రాజా! నీ వెవరో నాకు తెలుసు. నీవు నాతో ప్రతాపభానుని మంత్రినని అబద్ధం ఆడావు. నీ తెలివికి నేను సంతోషిస్తున్నాను. రాజులెప్పుడు తమ నిజ నామాన్ని యితరులకు తెలుపకూడదు. నీ యీ తెలివే నీ పట్ల నాకు ప్రేమను కలిగించింది. కుమారా! నీ  పేరు ప్రతాపభానుడు కదూ! నీ తండ్రి కేకయదేశాన్ని ఏలే సత్యకేతు మహారాజు కదూ ? గురుకృపవలన నాకు అన్నీ తెలుసుకునే మహిమ ఉన్నది. రాజా! నీ పట్ల నాకు గల ప్రేమతో నీకు వరాన్ని ప్రసాదిస్తున్నాను కోరుకో".

కపటముని తన గురించి అన్ని విషయాలు తెలుపటంతో ప్రతాపభానుడు ఆశ్చర్యానందాలతో, ముని కాళ్ళు పట్టుకొని, "కృపాసాగరా! ఇన్నాళ్ళకు నా జన్మ చరితార్థమైనది. మీవంటి మహనీయుల దర్శనం నాకు కలగటం నిజంగా నా పూర్వ జన్మ సుకృతం. మహనీయా! మీరు నాకు వరాన్ని ప్రసాదించారు ధన్యుణ్ణి. నా శరీరము వృద్ధావస్థకు, మృత్యువుకు, దుఃఖానికి గురికాకుండా ఉండేలా, యీ పృథ్విని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలేలా వరాన్ని ప్రసాదించండి."

రాజు మాటలకు కపటముని "రాజా! నీకోరిక తప్పక నెరవేరుతుంది. కానీ బ్రాహ్మణులను జయిస్తే కానీ నీవు ఏకచ్ఛత్రాధిపతివి కాలేవు. బ్రాహ్మణులు మహాశక్తి సంపన్నులు. వారి శాపానికి గురైనవాడిని ఎవరూ రక్షించలేరు. బ్రాహ్మణులను నీ వశం చేసుకున్ననాడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు కూడా నీ అధీనం అవుతారు." ప్రతాపభానుడు ముని చరణాలను పట్టుకొని, "మహాత్మా! బ్రాహ్మణులను ఏ విధంగా స్వాధీనం చేసుకోవాలో తెలపండి".

– సశేషం

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

# 3.తులసీదాసు

## హనుమంతుని ప్రేరణచేత శ్రీ రాముడు తులసీదాసుకు దర్శనము ఇచ్చుట

మర్నాడు ఆంజనేయుడు లక్ష్మీ సమేతుడైన నారాయణమూర్తిని దర్శించి భక్తిపూర్వకముగా ప్రదక్షిణం చేసి "భక్తజనమందారా! వాల్మీకి వంశమున భూలోకమును ఉద్ధరించుటకై జన్మించిన నీకు అత్యంత భక్తుడు అయిన తులసీదాసు నీ రామావతారాన్ని దర్శించాలని వేచి ఉన్నాడు. నీవు అతని కోరికను నెరవేర్చాలి, లేకపోతే అతడు ప్రాణత్యాగం చేస్తాడు" అన్నాడు.



నారాయణమూర్తి మందహాసం చేసి "ఓహో! తులసీదాసుతో ఏదో పని పడి వుంటుంది. అతని తల పగిలేటట్లు తన్నావు ఇప్పుడు దయారసాన్ని కురిపిస్తున్నావు. చిరకాలంనుండి నన్ను సేవిస్తున్న అతనిపై నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించావు. పోనీలే ఇప్పటికైనా అతనిపై దయ కలిగింది" అని పరిహాసం చేశాడు. ఆంజనేయమూర్తి తన నేరాన్ని మన్నించి తులసీదాసుకు దర్శనమీయమని అర్థించాడు. "నా అభిప్రాయం తెలియకుండా నువ్వు మాట ఎలా ఇచ్చావు? నా ఇష్టమైనప్పుడు నేను దర్శనం ఇస్తాను. కామాతురుడైవున్న వానికి నేను దర్శనం ఎలా ఇచ్చేది. అతడు ఇంకా 12 సంవత్సరాలు తపస్సు చెయ్యాల్సి వుంటుంది." అన్నాడు నారాయణమూర్తి.

ఆంజనేయమూర్తి పరితాపంతో "స్వామీ! పుత్రవాత్సల్యంతో నన్ను మీరు గౌరవిస్తున్నారని తొందరపడి మాట ఇచ్చాను. క్షమించండి" అన్నాడు. అప్పుడు దయాపూర్ణ అయిన లక్ష్మీదేవి "వత్సా !విచారింపకు! నీయందు స్వామికి దయ సంపూర్ణంగా ఉంది. నిన్ను పరీక్షించటానికి అలా అన్నారు. నీవు చేసిన పని

మాదే కాని వేరు కాదు. మేము ఇప్పుడే బయలుదేరి తులసీదాసు వద్దకు వెడుతున్నాము' అని చెప్పగా ఆంజనేయుడు సంతోషించి లక్ష్మీనారాయణులకు నమస్కరించి తన ఆశ్రమానికి వెళ్ళాడు. నారాయణమూర్తి లక్ష్మీదేవితో "ప్రాణేశ్వరీ! వాని చిత్త వృత్తి గుర్తించకుండా స్వస్వరూపంతో దర్శనం ఈయరాదు. మారువేషంతో వెళ్ళి తులసీదాసును చూసివద్దాం."అన్నాడు.

నిడుపు గడ్డంతో, రాతిపూసల దండలు మెడలో వేసుకొని తురక వేషం ధరించి, లక్ష్మణ, భరత, శతృఘ్నులను కూడ మ్లేచ్ఛ రూపాలు ధరింపజేసి తురకవనిత వలె నటించమని సీతాదేవిని, అశ్వరూపం ధరించిన గరుత్మంతుని మీద ఎక్కి తులసీదాసుకు ఎదురుగా వచ్చి నిల్చున్నాడు. తులసీదాసు వారిని చూసి ఎవరో తురకవాళ్ళు ఈ దారిన వెళ్తున్నారని ఎంచి శ్రీ రామమూర్తి రాకకై ఎదురు చూస్తున్నాడు. నారాయణమూర్తి లక్ష్మీదేవితో "చూశావా? మనం ఎదుట నిలచినా తెలియక ఆకాశం వైపు చూస్తున్నాడు. వీడి చిత్తం పరిశుద్ధం కాలేదు" అని అంతర్ధానమైనారు.

సాయంత్రం దాకా ఎదురుచూసి రామమూర్తి సందర్శనం కానందుకు దుఃఖించాడు. పౌరాణికుని మందిరానికి వెళ్ళి ఆంజనేయమూర్తికి నమస్కరించి ఘొల్లున ఏడ్చాడు. హనుమంతుడు "నాయనా! నీవు మోసపోయావు. శ్రీ రామమూర్తి తురక వేషంతో వచ్చి చాలాసేపు నీ ఎదుట నిలచి ఉన్నా తెలుసుకోలేక పోయావు. ఆయన విసుగుక్కొని తిరిగి వెళ్ళిపోయాడు" అని చెప్పాడు.

తులసీదాసు "స్వామీ! నేను సర్వజ్ఞుడనా? మారువేషంలోవస్తే వేను ఎలా గుర్తు పట్టేది?" అని చెప్పగా ఆంజనేయుడు "భయపడకు రేపు ఉదయానికి స్వామిని సపరివారసమేతంగా నీ భార్య కట్టించిన సత్రానికి తీసుకు వస్తాను" అని ధైర్యం చెప్పాడు. నామాట తప్పదు అని చెప్పి అంతర్ధానమైనాడు. అక్కడివారంతా తులసీదాసు భగవదంశ సంభూతుడు, ధర్మరక్షణార్థం వచ్చిన మహాత్ముడు అని కొనియాడారు. ఈ విషయం తెలిసిన కాశీరాజు ఆశ్చర్యచకితుడై మమతాదేవి సత్రానికి వచ్చి, తులసీదాసుని సందర్శించి మరునాడు శ్రీ రాముడు వస్తున్నాడన్న వార్త విని పట్టణం అంతా అత్యద్భుతంగా అలంకరించమని ఆజ్ఞాపించాడు.

ఆంజనేయుడు లక్ష్మీనారాయణులవద్దకు వెళ్లి తమరు మారువేషంలో వెళ్ళి తులసీదాసును మోసగించటం న్యాయంగా ఉందా? మీకు ఇంత కాఠిన్యం

తగదు. ఈ రోజు తులసీదాసుకు దర్శనమిచ్చి కరుణించండి" అని ప్రార్థించాడు. భగవంతుడు కోపం అభినయించి "చాలు! చాలు! మనః పరిపాకము లేని మందబుద్ధి సపరివారంగా వెళ్ళిన మావైపు కూడా చూడలేదు. మళ్ళీ దర్శనం ఇవ్వాలా? నాకేమి పని లేదా ఏమిటి? అతను ఇంకా 12 ఏళ్ళు తపస్సు చేస్తే అప్పుడు ఆలోచిస్తాను" అన్నాడు.

ఆంజనేయస్వామి "స్వామీ! మీ నామప్రభావమును వెల్లడించి లోకాలను ఉద్ధరించటానికే గదా వాల్మీకి మహర్షి తులసీదాసుగా అవతరించినది. నామాట నిలపటానికైనా మీరు తప్పక దర్శనం ఇవ్వాలి" అని బ్రతిమాలాడు. దానికి భగవంతుడు "నా అభిప్రాయము తెలిసి కోకుండానే వాగ్దానం చేశావు. ఈ విషయములో నేను ఏమీ చేయలేను వెళ్ళిరా" అని చెప్పాడు.

ఆంజనేయుడు "స్వామీ! తులసీదాసుకు రామరూపంలో దర్శనం ఇస్తారా సరేసరి లేకపోతే వైకుంఠాన్ని కాశీకి చేరుస్తాను కానీ, నేను తులసీదాసుకు ఇచ్చిన మాట తప్పను" అని చెప్పాడు. "నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో, నేను మాత్రం తులసీదాసుకు దర్శనం ఇవ్వను" అన్నాడు నారాయణమూర్తి. హనుమంతుడు లక్ష్మీనారాయుణలకు ప్రదక్షిణం చేసి "నా తల్లి సంపూర్ణ కటాక్షం ఉండగా నాకేల భయము అని తలచి విశ్వరూపం ధరించి హూంకరించి తన తోకతో వైకుంఠాన్ని గట్టిగా కట్టి పెకళించటం మొదలు పెట్టాడు. సత్యలోకంలో బ్రహ్మ అదిరాడు. దిగ్గజాలూ, దేవతా బృందాలు తల్లడిల్లాయి. వైకుంఠవాసులంతా విష్ణుమూర్తిని శరణు వేడారు.

అప్పుడు విష్ణుమూర్తి హనుమంతుని చూసి "నాయనా! వీరాధివీరా! నీ సాహసానికి మెచ్చాను, నీ ఇష్ట ప్రకారమే తులసీదాసుకు దర్శనం ఇచ్చి అతని కోరినవన్నీ ఇస్తాను. నీ విశ్వరూపం ఉపసంహరించు." అన్నాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL